
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

సోమవారం 16 సెప్టెంబరు 2024 | 5



బై..బై..గణేశా..

జై జై గణేశా అంటూ 9 రోజుల కిందట ఊరూవాడా గణపతి విగ్రహాలు ప్రతిష్ఠించారు.. ఆదివారానికి నవ రాత్రులు పూర్తవడంతో బై బై గణేశా అంటూ విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం, కొవ్వూరు గోదావరి రేవుల్లో పెద్ద ఎత్తున విగ్రహాలను నిమజ్జనం చేశారు.



ఉండ్రాజవరం మండలం వేలివెన్నులో గణపతి ఊరేగింపునకు సిద్ధమైన రథం



వెళ్లిరా..గణేశా..



రాజమహేంద్రవరంలో నిమజ్జనానికి గణేశులు

కచ్చులూరు..



కన్నీళ్లు!

కచ్చులూరు ఘోర కలికి ఐదేళ్లు

- ఐదేళ్ల కిందట గోదారిలో పెను ప్రమాదం
- అప్పట్లో 49 మంది పర్యాటకులు మృతి
- కనీవినీ ఎరుగని రీతిలో 38 రోజులు ఆపరేషన్
- అతి కష్టం మీద బోటు వెలికితీత
- అప్పటికీ.. ఇప్పటికీ ఇదొక పెను విషాదమే

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గోదారిలో కన్నీటికి ఐదేళ్లు.. నాడు పాపికొండలు విహారయాత్ర విషాదంగా మారింది.. ఆ సంఘటన పాపికొండల పర్యాటకానికి వెళ్లేవారిలో తీవ్ర భయాన్ని నింపింది. ఎందుకంటే 49 మంది పర్యాటకులు గోదావరిలో జల సమాధి అయి ఐదేళ్లయింది.. సరిగ్గా 2019 సెప్టెంబరు 15వ తేదీన 77 మందితో వెళుతున్న పర్యాటక బోటు కాస్తా గోదావరి సుడిగుండంలో చిక్కుకుంది. అప్పట్లో 26 మందిని స్థానిక జాలర్లు కాపాడినా 49 మంది ప్రాణాలు కోల్పోయారు. దేవీపట్నం మండలం కచ్చులూరు వద్ద జరిగిన ఈ ఘోర దుర్ఘటన ఇప్పటికీ గోదావరి ప్రజలకు కళ్లెదుట సాక్షాత్కరిస్తూనే ఉంది.ఆనాటి ఘోర సంఘటనను తలచుకుంటేనే కంట కన్నీళ్లే ... చాలా జీవితాల్లో నేటికీ ఆ కన్నీరు విషాదకలిగా మిగిలే ఉంది. పాపికొండలు విహారయాత్రలో అయినవారిని కోల్పోయినా అనేక మంది నది ఒడ్డునే రోజుల తరబడి అన్వేషించారు. అయిన వారు కానరాక, తిండీతిప్పలు లేక రోదనలతో తిరుగాడినవారెందరో. చిన్నారులను కోల్పోయిన కొందరు, భార్యల కడసారి చూపుకైనా నోచుకోవాలని ఇంకొందరు, కనిపించకుండా పోయిన తల్లిదండ్రుల కోసం రెప్పలమాటున కన్నీరుబుకుతుండగా విషణ్ణ వదనాలతో వేచి చూసినవారు ఇంకొందరు. పాపికొండలు విహార యాత్ర అంటే జనం అమితాసక్తి చూపేవారు. ప్రకృతి అందాలకు నెలవైన పాపికొండలు విహారయాత్ర తమ జీవితానికి గొప్ప అదృష్టమంటూ మురిసిపోయిన వారెందరో. దూరభారమైనా పిల్లాపాపలతో ఒక రోజు అయినా గోదావరి నదిలో గడిపామన్న తృప్తి మిగుల్చుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చేవారు. ఈ క్రమంలోనే 2019 సెప్టెంబరు 15న గోదావరి ఒడ్డున గండిపోచమ్మ దేవాలయం వద్ద వశిష్ఠ పున్నమి రాయల్ పర్యాటక బోటులోకి అప్పటికే నిర్దేశించిన పర్యాటక ప్రియులంతా తమవారితో కలిసి ఎక్కారు. గండిపోచమ్మ దేవాలయం నుంచి దాదాపు మూడున్నర గంటల పాటు ప్రయాణించి బోటు ముందుకు సాగుతుంది.. మరో నాలుగు గంటల్లో పాపికొండలుకు బోటు చేరుకోవాల్సి ఉండగా దేవీపట్నం మండలం కచ్చులూరు గ్రామం సమీపాన గోదావరి అతి వేగంగా ప్రయాణిస్తూ ఓ సుడిగుండంలా ఏర్పడి ఉంది. 77 మంది పర్యాటకులతో గోదావరిలో ప్రయాణిస్తున్న వశిష్ఠ బోటు కాస్తా ప్రవాహానికి ఎడమవైపున వెళ్లాల్సి ఉండగా కుడి వైపున ప్రయాణించి సుడిగుండంలో చిక్కుకుంది. ఒక్కసారిగా హాహాకారాలతో పర్యాటకులంతా కేకలు వేసినా ఫలితం లేకుండాపోయింది. అప్పటికే గోదావరిలో ఐదు లక్షల క్యూసెక్కులకుపైగా వరదనీరు ప్రవహిస్తోంది. ఒకవైపు వరద ఉధృతి.. మరో వైపు క్షణాల్లోనే బోటు సుడిగుండంలో ఒరిగిపోయింది. అప్పటికే సమీపాన మత్స్యకారులు జరిగిన ప్రమాదాన్ని గమనించి అప్రమత్తమయ్యారు. క్షణాల్లోనే వేగంగా అక్కడికి చేరుకుని 26 మందిని రక్షించి ఒడ్డుకు తీసుకెళ్లగలిగారు. అప్పటికే పర్యాటక బోటులో ఉన్న 49 మందితో బోటు కాస్తా గోదావరిలో మునిగిపోయింది. రాష్ట్రమంతటా ఈ ఘటన పెను విషాదాన్ని సృష్టించింది. మునిగిపోయిన పర్యాటక బోటును బయటకు తీయడానికి కాకినాడకు చెందిన ధర్మాడి సత్యం బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దించింది. 38 రోజుల పాటు శ్రమించి అప్పట్లో అక్టోబరు 21వ తేదీన బోటును వెలికితీయగలిగారు. మరో వైపు ఇప్పటికీ ప్రమాదంలో మృతుల సంఖ్యపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో బోటులో ఉన్నవారి సంఖ్యపై సరైన సమాచారం లేదు. ఈ ఘోర దుర్ఘటన అప్పటికీ ఇప్పటికీ పాపికొండలు పర్యాటక ప్రియులను కలచివేస్తూనే ఉంది. కచ్చులూరు దుర్ఘటన అనంతరం కొన్నాళ్ల పాటు పాపికొండలు యాత్రను ప్రభుత్వం నిలిపివేసింది. బోటులో ప్రయాణించే వారి రక్షణ చర్యలు పూర్తిగా గమనించిన తర్వాత ప్రయాణించే బోటు సామర్థ్యాన్ని ముందుగా నిర్ధారణ చేసిన తర్వాతే పాపికొండలు యాత్రకు అనుమతిస్తూ వస్తున్నారు.

పనిచేస్తుండగానే.. ప్రాణం పోయింది..

పనిలో పడి గమనించని విద్యుత్ తీగలు.. షాక్‌తో డ్రైవర్ మృతి



నల్లజర్ల,సెప్టెంబరు 15 : వరి కోత మిషన్ డ్రైవర్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. నల్లజర్ల మండలం పడమర చోడవరం గ్రామానికి చెందిన తానింకి నాగేంద్ర(30) అదే గ్రామానికి చెందిన నూనేసత్యనారాయణకు చెందిన వరి కోత మిషన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.ఆదివారం అనంతపల్లి గ్రామానికి చెందిన రైతుకు చెందిన వరి పొలం కోతకు రావడంతో కోత ప్రారంభించారు.మిషన్ ట్యాంకు నిండిపోవడంతో ధాన్యం ట్రాక్టర్‌లోకి పోసే క్రమంలో ధాన్యం బయటకు రాలేదు. దీంతో నాగేంద్ర ట్యాంకుపైకి ఎక్కి సరిచేసే క్రమంలో పైనే ఉన్న 11కేవి విద్యుత్ వైర్లు చేతికి తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు.మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం తాడేపల్లిగూడెం తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీహరి తెలిపారు.మృతుడికి భార్య రాణి,ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రేపు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 15 : నులిపురుగులతో పిల్లల్లో రక్తహీనత ఏర్పడుతుందని, దీని నివారణకు పిల్లలు తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబరు 17న నేషనల్ డీ వార్మింగ్ డే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 3,400 ఇన్‌స్టిట్యూషన్స్‌లో నులిపురుగుల నివారణ దినంకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. అంగన్వాడీ సెంటర్లతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలు, ఇంజనీరింగ్ కళాశాలలు తదితర అన్నింటిలోనూ మాత్రలు వేయడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల సహకారంతో జిల్లావ్యాప్తంగా తగిన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.



అడవిని వదిలి.. జనారణ్యంలోకి..

చిరుత ఎందుకొచ్చింది.. ఎలా వచ్చింది..

అమ్మో పులి.. రాజమహేంద్రవరంలో ఉందట.. ఎవరి నోటా విన్నా ఇదే మాట.. ఎక్కడ నుంచి వచ్చిందో.. ఎలా వచ్చిందో... ఎందుకు వచ్చిందో అంటూ రకరకాల ప్రశ్నలు.. ఒక్క ప్రశ్నకూ అంతుచిక్కదు.. మరో వైపు అటు వైపు వెళితే ఏం జరుగుతుందోననే భయం.. గత 10 రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదీ పరిస్థితి. అసలు పులి ఎక్కడ నుంచి.. ఎలా వచ్చి ఉంటుంది... ఇక్కడికే ఎందుకు వచ్చింది.. అసలేం చేస్తుందనే దానిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అడవి నుంచి దారి తప్పి జనారణ్యంలోకి చిరుత పులి ఎలా రాగలిగింది? చిరుత పులులకు ఆవాసంగా ఉన్న పాపికొండలు అభయారణ్యం నుంచి గోదావరి నది మీదుగా వచ్చిందా...లేదా అదే అభయారణ్యం విస్తరించి ఉన్న రంపచోడవరం,మారేడుమిల్లి మీదుగా వచ్చిందా? అటవీ శాఖ రకరకాల విశ్లేషణలు చేస్తోంది. రోజుకు వంద కిలోమీటర్లకుపైగా నడిచే చిరుత పులి ఎన్ని రోజుల పాటు నడుచుకుని ఇక్కడకు వచ్చింది? అనే దానిపై అటవీ శాఖలో చర్చ సాగుతోంది. భారీ వర్షాలు, వరద లకు అడవుల్లో చిరుతపులి స్థావరం దెబ్బతింటే అక్కడి నుంచి సురక్షిత స్థావరం వెదికే క్రమంలో దారితప్పి ఉంటుందని అనుమానిస్తున్నారు. చిరుత పులి స్థావరంలోకి పెద్ద పులి వస్తే తక్షణం ఉండే ప్రాంతాన్ని మార్చడం చిరుత లక్షణం కావడంతో ఆ క్రమంలో దారితప్పి ఉంటుందని భావిస్తున్నారు.ఈ క్రమంలో గోదావరిని ఈదుకుంటూ రావడం లేదా రంప అడవుల నుంచి గోకవరం మీదుగా రాజమహేంద్రవరంలోకి వచ్చేసి ఉంటుందని విశ్లేషిస్తున్నారు. ఇంకో పులితో జత కట్టిన తర్వాత ఆడ, మగ పులి విడిపోతాయి.ఇలా మళ్లీ జత కోసం ప్రయత్నించే సమయంలో దారితప్పి నగరంలోకి వచ్చి ఉంటుందని చెబుతున్నారు.గతంలో ఉమ్మడి జిల్లాలకు దారితప్పి వచ్చిన చిరుతల ఘటనలతో పోల్చి విశ్లేషణలు చేస్తున్నారు.

అందుకే కదలడం లేదా...

ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏలూరు జిల్లా పరిధిలోకి ఓ మగ పులి పాపికొండలు అభయారణ్యంలోకి వచ్చింది. వంద కిలోమీటర్లకుపైగా నడిచి తిరిగి అభయారణ్యంలోకి వెళ్లిపోయింది. పాపికొండలు అభయారణ్యాన్ని ఆనుకుని కొండలు, గోదావరి నది ద్వారా పులి సంచరించి ఇలా వచ్చిందని అప్పట్లో భావించారు. 2022 మేలో ఓ పులి ఏజెన్సీ మీదుగా ప్రత్తిపాడు, శంఖవరం, తుని రూరల్ మీదుగా వెళ్లింది. ప్రత్తిపాడులో బోనులోకి చిక్కినట్టే చిక్కి తప్పించుకుంది.ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, ఏజెన్సీ ప్రాంతాల మీదుగా విస్తరించి ఉన్న అడవుల నుంచి కొన్నిసార్లు దారితప్పడం వలనే ఈ ఘటనలు చోటుచేసుకుంటున్నట్టు చెప్తున్నారు. ఇప్పుడు రాజమహేంద్రవరంలోకి చిరుతపులి రావడం క్రమేపీ నగరాల్లోకి దారితప్పి వస్తున్న పులుల సంచారం చర్చనీయాంశంగామారింది.రాజమహేంద్రవరంలో సంచరిస్తున్న చిరుత రిజర్వు ఫారెస్టులో ఉంది. అనువైన వాతావరణం ఉండడంతో అక్కడి నుంచి కదలట్లేదని సమాచారం.

ఎలా వచ్చిందంటే...



చిరుత వచ్చింది ఈ దారిలోనేనా..?

పాపికొండలు అభయారణ్యం నుంచే చిరుతపులి దారితప్పి వచ్చిందని చెబుతున్నారు. ఎందుకంటే పులులు, చిరుత పులులకు పాపికొండలు అభయారణ్యం పెట్టింది పేరు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, అల్లూరి సీతారామరాజు జిల్లా వీటి పరిధిలోని ఏజెన్సీ కలిపి మొత్తం 1.02 లక్షల హెక్టార్లు అంటే 2.60 లక్షల ఎకరాలు.ఈ కొండల మధ్యలో గోదావరి ఉంది. ఈ అభయారణ్యం పులులకు ఆవాసం. మూడేళ్లకోసారి కెమెరా ట్రాప్ ద్వారా పులుల లెక్కింపును అధికారులు చేపడతారు. ఇటీవల ఈ అభయారణ్యంలో అధికారులు రెండు దశల్లో 232 ట్రాప్ కెమెరాలతో 116 ప్రాంతాల్లో సర్వే చేయగా నాలుగు పెద్దపులులు,ఆరు చిరుత పులులు ఉన్నట్టు గుర్తించారు. ట్రాప్ కెమెరాకు చిక్కని చిరుత పులులు మాత్రం ఇంకో 12 వరకు ఉండొచ్చని అంచనా. రంపచోడవరం, మారేడుమిల్లి అడవుల్లోనూ చిరుతల సంచారమే అధికమని అక్కడ పనిచేసిన అటవీ అధికారులు చెప్తున్నారు. రాజమహేంద్రవరంలోకి దారితప్పి వచ్చిన చిరుత పాపికొండలు అభయారణ్యం నుంచే వచ్చిందని చెబున్నారు. ఇటీవల గోదా వరికి వరద పోటెత్తడంతో అడవుల్లో చిరుత స్థావరం చెల్లాచెదురై కొత్త స్థావరం కోసం వెదికే క్రమంలో గోదావరి ఈదుకుంటూ రాజమహేంద్రరంలోకి వచ్చి ఉండొచ్చని అంచనా. పాపికొండలు అభయారణ్యం విస్తరించిన ఏజెన్సీ ప్రాంతంలోను వీఆర్‌పురం, రంపచోడవరం, మారేడుమిల్లి, గోకవరం మీదుగా చిరుత రాజమహేంద్రవరంలోకి దారి తప్పి వచ్చి ఉండొచ్చని చెప్తున్నారు.ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి పోలవరం ప్రాజెక్టు మీదుగా రంప ఏజెన్సీ వరకు విస్తరించి ఉన్న పాపికొండలు అభయారణ్యంలో ఎటువైపైనా పులులు దారి తప్పవచ్చని విశ్లేషిస్తున్నారు.

10 రోజులైనా చిక్కని చిరుత..

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం శివారులోని 900 ఎకరాల రిజర్వు ఫారెస్టులో పది రోజుల నుంచీ చిరుత హుందాగా సంచరిస్తూ అటవీ అధికారులకు మాత్రం చిక్కడం లేదు. పట్టుకొని తీరుతామని అటవీ అధికారులు.. పట్టుకోండి చూద్దామంటూ చిరుతపులి ప్రతిరోజూ సవాళ్లు విసురుకుంటూనే ఉన్నారు. అటవీ అధికారులు అమర్చిన 50 ట్రాప్ కెమెరాల్లోని ఎక్కడో అక్కడ చిరుత ఫొటోకు ఫోజు ఇచ్చి వెళ్లిపోతోంది. ఆ కెమెరాలను అటవీ సిబ్బంది తనిఖీ చేసే సమయానికి పుణ్యకాలం గడిచిపోతోంది. 50 మంది సిబ్బందితో కూడిన బృందాలు ఏ ప్రయత్నాలు చేస్తున్నా నాలుగు బోన్‌లలో ఒక్క దాంట్లోకీ చిరుత దూరడం లేదు. థర్మల్ డ్రోన్‌ని వినియోగించినా ఫలితం కానరావడం లేదు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు, ఆటోనగర్, దివాన్ చెరువు, శ్రీరాంపురం తదితర ప్రాంతాల ప్రజలు మాత్రం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రణాళికలు..విశ్లేషణలు.. ప్రకటనల మాట ఎలా ఉన్నా భయభ్రాంతులకు గురవుతున్నారు.

చిరుత కంటే తక్కువ ఎత్తు ఉంటేనే దాడి..

పులి, చిరుత పులికి చాలా వ్యత్యాసాలున్నాయి. పులి జాడ ఉన్న చోట చిరుతపులి పెద్దగా ఉండదు. కానీ చిరుతపులితో పోల్చితే పులి చాలా తెలివైనది. ఇది పెద్దగా జనావాసాల్లోకి రాదు. ఒకేచోట ఎక్కువగా ఉంటుంది.చిరుత అలా కాదు. ఇది నిరంతరం తిరుగుతూనే ఉంటుంది. వంద కిలోమీటర్లు అవలీలగా నడిచేస్తుంది. పులి కేవలం ఆకలి వేస్తేనే వేటాడుతుంది. చిరుతపులి అలా కాదు.చిరుత లక్షణం నిరంతరం ఏదొకటి వేటాడుతూ తింటూ ఉండడమే. ఇది తక్కువ ఎత్తయిన జంతువులు పంది,కుక్కలను వేటాడి తింటుంది. ఎత్తయిన జంతువులను చిరుత వేటాడలేదు. మనుషులు ఎత్తుగా ఉండడం వల్ల మనుషులను చూస్తే చిరుత కొంత భయపడుతుంది.అదే కూర్చుని ఉంటే తక్కువ ఎత్తు వల్ల సులువుగావేటాడుతుందనిఅటవీ అధికారులు విశ్లేషించారు.

- రాజమహేంద్రవరంలోనే చిరుత
- ఇంకా కొనసాగుతున్న అన్వేషణ
- పాపికొండలు అభయారణ్యం నుంచే రాక?
- ఇక్కడకు రావడానికి కారణాలపై విశ్లేషణలు
- ఎలా వచ్చిందనే దానిపై ఇంకా అస్పష్టత
- పులి కంటే చిరుతపులే ప్రమాదకరం
- ఆకలి వేసినప్పుడే పులి వేట..
- చిరుతది నిరంతర వేట

పిల్లలను బయటకు రానీయవద్దు : డీఎఫ్‌వో

దివాన్‌చెరువు, సెప్టెంబరు 15: దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో అమర్చిన ట్రాప్ కెమెరాలో ఆదివారం తెల్లవారుజామున చిరుతపులి కదలిక చిత్రాలు కనిపించాయని ఇన్‌చార్జి డీఎఫ్‌వో ఎస్.భరణి తెలిపారు. ప్రస్తుతం చిరుతపులి దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోనే ఉందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హౌసింగ్‌బోర్డుకాలనీ,ఆటోనగర్, దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ఏరియాల్లో పిల్లలను తల్లిదండ్రులు సాయంత్రం 6 గంటల తర్వాత బయటకు తిరగకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.



రైతుల కంట్లో.. పొగాకు!

నాడు గ్రేడ్ వన్ అధరహో.. నేడు లో గ్రేడ్ బెధరహో

- కొనుగోళ్లకు కంపెనీల నిరాసక్తత
- నాడు గ్రేడ్ వన్ కిలో రూ.400
- నేడు లో గ్రేడ్ రూ.130-రూ.120
- కొనేవారు లేక రైతుల ఆందోళన
- కేంద్రాల దళారుల రాజకీయం
- లబోదిబోమంటున్న రైతాంగం

గోపాలపురం/దేవరపల్లి, సెప్టెంబరు 15 : పొగాకు బంగారం.. ఎందుకంటే ఆరంభంలో ధర అదిరిపోయింది.ఎన్నడూ లేనిది రికార్డు స్థాయిలో విక్రయించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది నెంబర్ వన్ పొగాకుకు ధరలు ఆకాశాన్నంటాయి.అయితే చివరికి లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేసే వారులేక రైతుల ముఖం పొగచూరిపోతుంది. రైతుల పొగాకు బేళ్ళు యార్డుకు తీసుకురావడం..వెనక్కి తీసుకెళ్లడంతో తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. ఈ ఏడాది అమాంతం పొగాకు కిలో ధర రికార్డు స్థాయిలో రూ.400లకు అమ్ము డుపోయింది.అదే సమయంలో లోగ్రేడ్ పొగాకు మొదటి దశలో రూ.250 నుంచి క్రమంగా రూ.170ల దగ్గర ధర నిలకడగా నిలి చింది.దీంతో ఈ ఏడాది పెట్టుబడిపోనూ నాలుగురాళ్ళు వెనకేసుకుందామని అనుకున్న పొగాకు రైతాం గానికి కొత్త కష్టం వచ్చిపడింది. గ్రేడ్ వన్ పొగాకును కొనుగోలు చేసిన ఆయా కంపెనీల ప్రతినిధులు లోగ్రేడ్ (మాడు) పొగాకును కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపకపోవడంతో రైతుల గుండెల్లో ఇప్పుడే అసలైన గుబులు మొదలైంది.

దళారుల దందా..

ప్రతి రైతుకు ఎకరానికి క్వింటా నుంచి రెండు క్వింటా వరకు లోగ్రేడు(మాడు) తప్పకుండా ఉంటుంది. వాతావరణం అనుకూలించకపోయినా సాగులో తేడా వచ్చినా ఈ లో గ్రేడు పొగాకు మరింత అద నంగా పెరుగుతుంది.మేలురకం పొగాకు ధరలు అదనంగా ఉండడంతో కొందరు దళారులు లోగ్రేడ్ ధరలు బాగానే ఉంటాయని ఊహించి ఇప్పటికే పెద్దమొత్తంలో కొనుగోలు చేసి డబ్బు చేసినట్టు సమాచారం. వేలం కేంద్రంలో నిర్దేశించిన పొగాకు కన్నా అదనంగా పొగా కు ఉంటుందనే అంచనాలతో బయ్యర్లు, దళారులు కుమ్మక్కయి రైతు పొగాకును కొనుగోలు చేయడంలేదు. రెండు మూడు వారాలు రైతు వద్ద పొగాకు కొనుగోలు చేయకపోతే విసుగుచెందిన రైతులుపొగాకును బోర్డుకు తీసుకురావడం మానేస్తారని..ఆ సమయంలో దళా రుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేసి అధిక ధర ఇచ్చేందుకు దళారులు ఆయా కొనుగోలుదారులు కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇంత జరుగుతున్న బోర్డు అధికారులు మీనమేషాలు లెక్కవేస్తున్నారు.

ఇప్పుడేం చేయాలి..?

పొగాకు సాగు వచ్చే ఏడాదికి ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైనా గతేడాది పండించిన పొగాకు అమ్మకాలు పూర్తికాకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్జీనియా పొగాకు సాగులో పంట కాలం కంటే పండిన పంటను అమ్మడానికే ఎక్కువ సమయం పడుతుందని రైతులు భావిస్తున్నారు. ఆరుగాలం పండించిన పంట అమ్ముకో వడానికి ఆంక్షల మధ్య పొగాకు రైతాంగం కొట్టుమిట్టా డు తుంది.వచ్చే ఏడాది పొగాకు నాట్లుకు సంబంధించి నారు మ డులు పెంపకంలో రైతులు బిజీబిజీగా గడిపే సమయంలో సెప్టెంబరు మాసం వచ్చినా ఇప్పటికి పొగాకు కొనుగోళ్ల ప్ర క్రియ పూర్తి కాలేదు.దీంతో ఈ ఏడాది పంట కొనుగోలు పూర్తికాక వచ్చే ఏడాది పంటకు సన్నద్ధం కాలేక రైతులు ఇక్కట్లు పడుతున్నారు.తదుపరి పంట సాగుకు సన్నద్ధం కాక ముందే కొనుగోళ్లు పూర్తిచేయాలని రైతులు భావిస్తున్నారు.

పడిపోయిన పొగాకు ధర

నిన్న మొన్నటి వరకు గరిష్ఠ స్థాయిలో ధర పలికిన వర్జీనీయ పొగాకు చివరి దశలో ధర పతనమై కొనుగోలు చతికల బడ్డాయి. దీంతో లోగ్రేడ్ పొగాకు కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ఏడాది గ్రేడ్‌వన్ పొగాకు ధర రికార్డు స్థాయిలో రూ.400 ధర పలికింది. దీంతో రైతులు గ్రేడ్ వన్ పొగాకు విక్రయా లు మొదటి దశలో జరిపారు. పొగాకు కొనుగోళ్లు చివరి దశకు రావడంతో లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేయ డానికి ఆయా కంపెనీల ప్రతినిధులు వెనక డుగు వేస్తున్నారు. దీంతో వేలం కేంద్రం వద్ద లోగ్రేడ్ బేళ్ళు గుట్టలుగుట్టలుగా ఉన్నాయి.శనివారం గోపాలపురంలో లోగ్రేడ్ పొగాకును కనిష్ఠంగా రూ.130 రూపాయలకు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపకపోవడంతో రైతులు అమ్మకాలు నిలిపివేశారు.వేలం కేంద్రానికి శనివా రం 800 లోగ్రేడ్ పొగాకు బేళ్ళు అమ్మకానికి వచ్చి కొనుగోలు జరపకపోవడంతో ప్లాట్‌ఫామ్ పై గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలో లోగ్రేడ్ పొగాకు రూ.120లకు ధర పడిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొగాకు కంపెనీల మధ్య పోటీ లేక ఒకటి రెడు కంపెనీలే పాల్గొనడంతో ధర రూ.120కే పరిమితం చేశారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



బ్రిటిష్‌కాలం నాటి సంప్రదాయానికి స్వస్తి

సబ్ రిజిస్ట్రారు పోడియం తొలగింపు

సీతానగరం,సెప్టెంబరు 15 : బ్రిటిష్ కాలంనాటి సంప్రదాయానికి స్వస్తి పలికారు.. ప్రజలకు స్నేహపూర్వక సేవలందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల కు ఆజ్యం పోశారు. రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా ఆదేశాల మేరకు సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో ఉన్న ప్రత్యేక పోడియంను ఆదివారం తొలగించారు.గతంలో సబ్ రిజిస్ట్రారు సీటు ప్రత్యేకతను సంతరించుకునే విధంగా ఎత్తుగా దిమ్మ కట్టి దిమ్మకు చుట్టూ ఎరుపు రంగు క్లాత్‌తో కప్పి ప్రత్యేకత చూపించేవారు. అయితే ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఫ్లోరింగ్‌కు సమాన ఎత్తులోనే టేబుల్ వేసుకుని ఎదురుగా కుర్చీలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మార్పులు చేస్తున్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం సీతానగరంలో పోడియం తొలగించారు.

సంఘాలకు సహకారం

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 50 చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు
- ఈ నెల 21 నుంచి ప్రక్రియ మొదలు
- డిసెంబర్ 6న కొలువుదీరనున్న కొత్త పాలక వర్గాలు
- ఐదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వం
- ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), అమలాపురం రూరల్ సెప్టెంబర్ 15: వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన చేనేత సహకార సంఘాలకు పునర్జీవం పోసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ఐదేళ్లు ఎన్నికలు నిర్వహించకుండా వైసీపీ ప్రభుత్వం అధికారుల కమిటీలతో సరిపెట్టింది. ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా దెబ్బతీసింది. అంతకుముందు అమలైన పథకాలను సైతం నిలిపి వేసి కోలుకోలేని దెబ్బ తీసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. జిల్లాలో ఎన్నికల అధికారుల నియామకంతో ఈనెల 21 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. డిసెంబర్ 6న కొత్త పాలకవర్గాలు కొలువు దీరనున్నాయి.

50 చేనేత సహకార సంఘాలు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన చేనేత సంఘాలు 50వరకు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 18, తూర్పుగోదావరి జిల్లాలో 9, అంబేద్కర్ కోనసీమలో 23 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు నిర్లిప్తంగా ఉన్నాయి.

తొమ్మిది మంది సభ్యులతో..

చేనేత సహకార సంఘాలకు ఆంధ్రప్రదేశ్ సహకార చట్టం ప్రకారం చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఒక్కో సంఘానికి తొమ్మిది మంది సభ్యులతో పాలకవర్గాన్ని ఎన్నుకోనున్నారు. వీరిలో నుంచే అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారు. తొమ్మిది మంది సభ్యుల్లో ఇద్దరు కచ్చితంగా మహిళలు ఉండాలి. ఎన్నికల్లో నిల్చునేందుకు, ఓటు వేయడానికి సభ్యులు 300 షేరు ధనం కలిగి ఉండాలి. అలాగే మూడు నెలల నుంచి సొసైటీకి ఎటువంటి బకాయిలు ఉండకూడదని జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ పెద్దిరాజు 'ఆంధ్రజ్యోతి' తెలిపారు. పాలకవర్గాల నియామకంతో చేనేత సంఘాల బలోపేతానికి అవకాశముందని సంఘాల్లోని కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయన్నారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో అమలైన యార్న్ సబ్సిడీ, మార్కెట్ ఇన్సెంటివ్, రిబేట్, ముద్ర రుణాలు, థ్రిఫ్ట్ ఫండ్ తదితర పథకాలను పునరుద్ధరిస్తామని ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో వీటిని గరిష్ఠంగా వినియోగించుకునేందుకు పాలకవర్గాల ద్వారా సంఘాల్లోని కార్మికులకు అవకాశం కలగనుంది.

గత ఐదేళ్లుగా ఎన్నికల కోసం ఎదురుచూపులు

2013 ఫిబ్రవరిలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో చేనేత సహకార సంఘం ఎన్నికలు జరిగాయి. 2018 ఫిబ్రవరితో పాలకవర్గం సమయం ముగిసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని పూర్తిగా విస్మరించడంతో దిక్కు తోచని స్థితిలో ఇప్పటి వరకు చేనేత కార్మికులు ఉన్నారు. అయితే ఇప్పుడు చేనేత సహకార సంఘాలకు కూటమి ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడంతో చేనేత కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే సహకార సంఘాల ఎన్నికల కోసం అధికారులు సమాయత్తమవుతున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

జడ్.రాగంపేటలో 3884 కిలోల బియ్యం, వాహనం సీజ్


జడ్.రాగంపేట వద్ద పట్టుకున్న పీడీఎస్ బియ్యం, వాహనం వద్ద అధికారులు

గండేపల్లి, సెప్టెంబర్ 15: మండలంలోని జడ్.రాగంపేట గ్రామంలో పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. వ్యాన్‌లో ఉన్న బియ్యాన్ని తనిఖీ చేయగా అవి పీడీఎస్ బియ్యంగా గుర్తించి స్వాధీనపరచుకున్నారు. రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ 93 బస్తాల్లో సుమారు 3884 కిలోల బియ్యాన్ని గుర్తించామన్నారు. ఈ బియ్యం కిర్లంపూడి మండలానికి చెందిన నల్లంశెట్టి లక్ష్మీనారాయణకు చెందినదిగా తెలిపారు. కిర్లంపూడి మండలం గోనేడ గ్రామం నుంచి దివాన్ చెరువు ప్రాంతంలోని పౌల్ట్రీ ఫారాలకు రవాణా చేస్తుండగా పక్కా సమాచారంతో పట్టుకున్నామన్నారు. రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని స్వాధీన పరచుకుని డ్రైవర్ అరట గంగాధర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. బియ్యం, వాహనం విలువ రూ.11,28,714గా తెలిపారు. దీనిపై సివిల్ సప్లయ్స్ అధికారులు 6ఏ కేసు నమోదు చేసి అక్రమంగా తరలిస్తున్న వారినపై క్రిమినల్ కేసుల నమోదు కోసం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగవెంకటరాజు, వీరబాబు, లోవరాజు, సీఎస్‌టీడీ కృష్ణ పాల్గొన్నారు.

'ఆ సొమ్ములు చెల్లిస్తున్నాం'

- కలెక్టర్ ప్రశాంతి

దివాన్‌చెరువు, సెప్టెంబరు15 : రాజానగరం మండలం జి.ఎర్రంపాలెం బ్యాంకు ఆఫ్ బరోడా బ్రాంచి (బీఓబీ)లో దుర్వినియోగమైన సొమ్ము రూ67.52 లక్షలను ఈనెల 17వ తేదీ మంగళవారం నుంచి బ్రాంచి నందు చెల్లింపులు జరుపుతామని జిల్లాకలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. . జి.ఎర్రంపాలెం బీఓబీ బ్రాంచ్‌కు చెందిన వ్యాపార కరస్పాండెంట్ ముత్తాబత్తులనానిబాబు ద్వారా కస్టమర్ల డిపాజిట్ల సొమ్ము దుర్వినియోగమైనట్టు గుర్తించామన్నారు. సంబంధిత ఖాతాదారులకు ఆ మొత్తాన్ని చెల్లించాలని బ్యాంకుఅధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈనెల 17 నుంచి జి.ఎర్రంపాలెం బ్రాంచ్‌లో డీఆర్‌డీఏ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. దుర్వినియోగమైనట్టుగా గుర్తించిన రూ.67.52 లక్షలను ఎం/ఎస్ విజన్ ఇండియా టెక్ సర్వీసెస్ లిమిటెడ్ నుంచి వసూలు చేసి బాధిత ఖాతాదారులకు ఆయా మొత్తాలను రీయింబర్స్ చేయనున్నట్లు బాంకు అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారని కలెక్టర్ తెలిపారు. ఇందులో పుణ్యక్షేత్రానికి చెందిన 15 ఖాతాలకు సంబంధించి రూ26,69,000, కొండగుంటూరు పాకలకుచెందిన రెండు ఖాతాలకు రూ.81 వేలు, సంపత్‌నగరానికి చెందిన 6 గ్రూపుల ఖాతాలకు రూ.5,45,000, జి.ఎర్రంపాలేనికి చెందిన 41 ఖాతాలకు రూ34,11, 757లు దుర్వినియోగమైనట్టుగా గుర్తించామని డీఆర్‌డీఏ పథకసంచాలకులు ఎన్‌వీవీఎస్ మూర్తి తెలిపారని కలెక్టర్ పేర్కొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు


కంచుగరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

అంతర్వేది, సెప్టెంబరు 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. చివరి రోజు ఆదివారం స్వామి, అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు పరిపూర్ణమయ్యాయి. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అభిషేకం, అలంకార తిరుమంజనం, ప్రాయశ్చిత హోమం, మహాశాంతి హోమం, పరమాత్మికోపనిషత్తు, శేషహోమం, పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం కంచు గరుడ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామపురవీధుల్లో స్వామి-అమ్మవార్ల ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. పవిత్ర అవరోహణ, విశేషార్చన, నీరాజన మంత్రపుష్పాలు, పవిత్రముల వినియోగం జరిగాయి. కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరాజగోపాలరాజాబహుదూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, గొట్టుముక్కల భీమరాజు, నల్లా సత్యకృష్ణకిరణ్‌ప్రసాద్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా అంతర్‌జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

బాలురు విభాగంలో చిత్తూరు.. బాలికల విభాగంలో విశాఖ విజయం


విజేతలకు షీల్డ్‌లు అందజేస్తున్న ఈవో రామచంద్రమోహన్, యనమల రాజేష్

అన్నవరం, సెప్టెంబరు 15: మూడురోజులుగా కాకినాడ జిల్లా అన్నవరంలో జరుగుతున్న అంతర్ జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీల ఫైనల్స్ ఉత్కంఠ భరితంగా జరిగాయి. బాలుర విభాగంలో చిత్తూరు, శ్రీకాకుళం, విశాఖ, కడప జిల్లాలు వరుసగా తొలి నాలుగు స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో విశాఖ పట్నం, గుంటూరు, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జట్లు వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో నిలిచినట్లు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ముప్పన వీర్రాజు తెలిపారు. అన్ని టీంలలో ప్రతిభకనబరిచిన వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుగా ఎంపికచేశారు. బాలుర రాష్ట్ర జట్టులో శ్రీకాకుళానికి చెందిన ఎస్.ప్రవీణ్‌కుమార్, జి.చాయకిరణ్, చిత్తూరుజిల్లాకు చెందిన వి.సి హేమచరణ్, కె.తేజేష్, కడపనుంచి కౌశిక్, తూర్పుగోదావరి నుంచి సుదర్శన్, విశాఖ నుంచి పైడినాయుడు, కర్నూల్ నుంచి తేజస్వీరెడ్డి, అనంతపూర్ నుంచి రాజశేఖర్, కృష్ణానుంచి శైలేంద్రకుమార్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో గుంటూరు నుంచి ఎం లుధియా, దేవమణి, తూర్పుగోదావరి నుంచి కుమారి, మానస ప్రణతి, విశాఖ నుంచి కీర్తన, శ్రీకాకుళం నుంచి జ్యోత్స్న చిత్తూరు నుంచి ప్రశాంతి, పశ్చిమగోదావరి నుంచి అనూషలు ఎంపికయ్యారు. వీరు రాష్ట్రం తరఫున హర్యానాలో జరిగే పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారు. విజేతలకు దేవస్థానం ఈవో రామచంద్రమోహన్, టీడీపీ నేత యనమల రాజేష్ షీల్డ్‌లు అందజేశారు.

నరాలు తెగే ఉత్కంఠతో..


హోరాహోరీగా పవర్ లిఫ్టింగ్ చేస్తున్న క్రీడాకారులు


విజేతలుగా నిలిచిన క్రీడాకారిణులు

- పురుషుల విభాగంలో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు
- మహిళా విజేతలకు పతకాలు అందజేత
- స్ట్రాంగ్ ఉమెన్‌లుగా శ్రావణి, సాదియాఅల్మాస్, అనూష

అమలాపురం టౌన్, సెప్టెంబరు 15: అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక భూపయ్య అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో రెండో రోజు ఆదివారం రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు పురుషుల విభాగంలో జరిగాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 455 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు, జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అర్ధరాత్రి వరకు పవర్ లిఫ్టింగ్ పోటీలు కొనసాగుతున్నాయి.

స్ట్రాంగ్ ఉమెన్లుగా శ్రావణి, సాదియాఅల్మాస్, అనూష

11వ రాష్ట్రస్థాయి మహిళల పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ చాంపియన్ షిప్ పోటీల్లో మహిళా విజేతల వివరాలను వెల్లడించారు. మహిళల సబ్‌జూనియర్స్ విభాగంలో 70 పాయింట్లతో కడప జిల్లా ప్రథమ, 45 పాయింట్లతో గుంటూరు ద్వితీయ, 37 పాయింట్లతో విజయనగరం జిల్లా తృతీయస్థానాన్ని సాధించింది. జూనియర్ మహిళల విభాగంలో 56 పాయింట్లతో గుంటూరు ప్రథమ, 47 పాయింట్లతో విజనగరం ద్వితీయ, 21 పాయింట్లతో ప్రకాశం తృతీయస్థానం సాధించింది. సీనియర్ మహిళల విభాగంలో గుంటూరు జిల్లా 70 పాయింట్లతో ప్రథమస్థానం, తూర్పుగోదావరి జిల్లా 33 పాయింట్లతో ద్వితీయస్థానం, 21 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లా తృతీయస్థానం సాధించింది. అనంతరం స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్స్‌ను ప్రకటించారు. సబ్ జూనియర్ బాలికల విభాగంలో పి.శ్రావణి (గుంటూరు) ప్రథమ, పి.వందన (కోనసీమ) ద్వితీయ, హర్షితతివారి (వైఎస్సార్‌కడప) తృతీయ స్థానంతో స్ట్రాంగ్ ఉమెన్‌లుగా నిలిచారు. జూనియర్ మహిళ విభాగంలో ఎస్కే సాదియాఅల్మాస్ (గుంటూరు) ప్రథమ, ఎం.షానూన్ (గుంటూరు) ద్వితీయ), ఎస్కే సబీనా (గుంటూరు) తృతీయస్థానంతో స్ట్రాంగ్ ఉమెన్లుగా నిలిచారు. సీనియర్ మహిళల విభాగంలో డి.అనూష(ఎన్టీఆర్) ప్రథమ, బి.చంద్రిక(గుంటూరు) ద్వితీయ, ఎస్కే సాదియాఅల్మాస్ (గుంటూరు) తృతీయ స్థానాలతో స్ట్రాంగ్ ఉమెన్లుగా నిలిచారు. మహిళల విభాగంలో వివిధ కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో వరుస స్థానాలు సాధించిన పవర్ లిఫ్టర్లకు అసోసియేషన్ల పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అల్లాడ శరత్‌బాబు, డీవీ రమణ, ఎంఎస్ఎన్ మూర్తి, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, యేడిద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటిలో నిద్రిస్తుండగానే..

చోరీకి పాల్పడిన దొంగ

మెయిన్ డోర్ పగులగొట్టి 90గ్రాముల బంగారం, రూ.3 వేల నగదు అపహరణ

అనపర్తి, సెప్టెంబరు 15 : అనపర్తిలో వరలక్ష్మి టవర్స్‌లో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలోనే ఈ చోరీ జరిగిందని అనపర్తి ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కాకి సత్య సునీత తన భర్తతో కలిసి అనపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని వరలక్ష్మి టవర్స్‌లో నివసిస్తున్నారు. శనివారం రాత్రి ఇంటి తాళాలు వేసుకుని ఒక బెడ్ రూమ్‌లో నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారు జాము సమయంలో ముసుగు వేసుకున్న ఓ వ్యక్తి మెట్ల మార్గం ద్వారా వీరు ఉంటున్న ప్లాటు వద్దకు చేరుకుని మెయిన్ డోర్‌ను పగులగొట్టి లోనికి ప్రవేశించాడు. దంపతులు నిద్రిస్తున్న పక్క గదిలోకి ప్రవేశించి చాకచక్యంగా లాకర్‌ను పగులగొట్టి లాకర్‌లో ఉన్న సుమారు 90 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.మూడు వేల నగదు దోచుకుపోయాడు. తెల్లవారిన తరువాత విషయం తెలుసుకున్న దంపతులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శివగణేష్, ఎస్ఐ శ్రీను నాయక్‌లు సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్‌కు సమాచారం అందించడంతో వారు వేలి ముద్రలను సేకరించారు. చోరీకి గురైన బంగారం విలువ సుమారు రూ.ఐదు లక్షల వరకు ఉంటుందని బాధితులు వాపోతున్నారు. బాధితురాలు సత్యసునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు.

తగ్గుతున్న గోదావరి


ధవళేశ్వరం, సెప్టెంబరు15: గోదావరి పరిస్థితి తగ్గుముఖం పట్టింది. సాయంత్రానికి గోదావరి నీటిమట్టం 9.50 అడుగులకు చేరుకోగా 6,90,849 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ఎగువన భద్రాచలం వద్ద నీటిమట్టం 35.30 అడుగులకు చేరుకుంది.

గంగమ్మ ఒడికి.. గణపయ్య

గణపతి నవరాత్రమహోత్సవాల ముగింపు సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయి. చవితి పందిళ్లలో కొలువుదీరిన బొజ్జగణపయ్యలను ఊరేగింపు నడుమ గంగమ్మ ఒడికి చేర్చారు. సందడి వాతావరణంలో 'ఓ బొజ్జ గణపయ్యా.. వెళ్లి రావయ్యా' అంటూ సాగనంపారు. యువతీయువకులు, చిన్నారులు, పెద్దలు ఈ నిమజ్జన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆ దృశ్యాలివే..



రాజమహేంద్రవరంలోని వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు


రాజమహేంద్రవరంలో గంగమ్మ ఒడికి చేరిన గణేశుడు


ప్రత్తిపాడులో గణేశ్ నిమజ్జనానికి తరలివెళుతున్న భక్తులు


కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్‌లో వినాయకుడి ప్రతిమతో..


రాజమహేంద్రవరంలో గోదావరి చెంత నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

కిర్లంపూడి, సెప్టెంబర్ 15: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం పాలెం గ్రామంలో వినాయక నిమజ్జనంలో అపశ్రుతి జరిగింది. వీరవరం గ్రామానికి చెందిన బి.లక్ష్మణరావు(33) ఏలేరు కాలువలో నిమజ్జనానికి వెళ్లి ప్రమాదవశాత్తూ బొమ్మకింద పడి మృతిచెందాడు. విషయాన్ని గ్రహించి గత ఈతగాళ్లు అతడిని బయటకు తీసి సీపీఆర్ చేసినా ఫలించలేదు. నీళ్లు ఎక్కువగా తాగడం వల్ల మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలిసిన జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, కిర్లంపూడి ఎస్ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బంధువులకు సమాచారం అందడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గణేశ్ నిమజ్జనాల్లో ఘర్షణ

కొత్తపల్లి, సెప్టెంబరు 15: గణేష్ నిమజ్జన వేడుకల్లో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలైన సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం రమణక్కపేటలో జరిగింది. గణేష్ నవరాత్రులు ముగింపు సందర్భంగా ఆదివారం వినాయకుని నిమజ్జనం చేసేందుకు స్థానిక టీడీపీ నాయకుడు, ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెనుమల్లు సుభాకర్‌రెడ్డి వర్గం, వైసీపీ వర్గం నుంచి చింతపల్లి లక్ష్మీరెడ్డి ఊరేగింపుగా వెళ్లి ఊరి చివర ఉప్పుటేరులో వినాయకున్ని నిమజ్జనం చేశారు. వైసీపీ జెండాలతో గణేష్ నిమజ్జన ఊరేగింపు నిర్వహించడాన్ని టీడీపీ నాయకుడు సుభాకర్ రెడ్డి ఖండించారు. దీనికి కోపోద్రిక్తుడైన వైసీపీ నాయకుడు లక్ష్మీరెడ్డి కర్రతో సుభాకర్‌రెడ్డిని విచక్షణారహితంగా శరీరంపై కొట్టడంతో తట్టు తేలాయి. సుభాకర్ రెడ్డిని అడ్డుకోవడానికి వెళ్లిన పెనుమల్లు రాజుకు కూడా ఖర్రదెబ్బలు తగలడంతో ఇరువురు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గాయాలైన వ్యక్తులను చికిత్స కోసం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన గ్యాస్ సిలిండర్ల లారీ

రాజానగరం, సెప్టెంబరు 15 : అనపర్తి నుంచి గుమ్మళ్లదొడ్డికి గ్యాస్ సిలిండర్లతో వస్తున్న లారీ మార్గమధ్యలో రాజానగరం మండలం తోకాడ గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తూ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని, కిళ్లీ దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు చెబుతున్నారు. తనకు నీరసంతో కళ్లు తిరిగినట్లుగా అనిపించడం వల్లే లారీ అదుపుతప్పినట్లు డ్రైవర్ చెబుతున్నాడు. ఖాళీ సిలిండర్లు కావడం, ఎవరికి ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పోలియో టీకా అధిక డోస్ : పసికందు మృతి

దేవీపట్నం, సెప్టెంబర్ 15: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలంలోని ఇందుకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో లోతుపాలెం గ్రామానికి చెందిన రెండు నెలల పసికందు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలియో టీకా అధిక డోస్ వేయడంవల్లే మృతి చెందినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆశా వర్కర్, ఆసుపత్రి నర్సు నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందంటున్నారు. దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

తేటగుంటలో పేకాట శిబిరంపై దాడి

తుని రూరల్, సెప్టెంబరు 15: కాకినాడ జిల్లా తేటగుంటలో పేకాట శిబిరంపై రూరల్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని పేకాట స్థావరంలో కుర్చీలు, టేబుల్, రూ.83,950లు సీజ్ చేసినట్టు ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు. పట్టుబడిన వారిలో పలువురు వైసీపీ కీలక నాయకులు ఉండటం విశేషం. కేసు నమోదు చేసిన రూరల్ ఎస్ఐ పేకాట, గుండాట, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవనిహెచ్చరించారు.


కారు ఢీ కొని కళాకారుడి మృతి

ప్రత్తిపాడు, సెప్టెంబరు15: ప్రత్తిపాడ-ధర్మవరం 16వ నెంబరు జాతీయ రహదారిపై రాచపల్లి అడ్డురోడ్డు వద్ద చిన్నకారు ఢీ కొన్న దుర్ఘటనలో అనకాపల్లికి చెందిన కళాకారుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. అనకాపల్లికి చెందిన 15 మంది తీన్‌మార్ కళాకారుల బృందం గుంటూరులో ప్రదర్శన ఇచ్చేందుకు శనివారం రాత్రి బయల్దేరారు. ఈ వ్యాన్ జాతీయ రహదారి రాచపల్లి అడ్డురోడ్డు వద్దకు చేరుకోగా అనకాపల్లికి చెందిన కళాకారుడు బి.అప్పారావు(45)అల్పాహారం కోసం హైవే రోడ్డు దాటి దాబా హోటల్ వద్దకు వెళ్లాడు. టిఫిన్ కట్టించుకుని తిరిగి రోడ్డు దాటుతుండగా అన్నవరం నుంచి రాజమండ్రి వెళ్లే కారువేగంగా అప్పారావును ఢీకొంది. ఈ సంఘటనలో కారు ఢీ కొన్న అప్పారావును తోటి కళాకారులు వారు వచ్చిన వాహనంలో ప్రథమ చికిత్స కోసం ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. అప్పారావు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున అప్పారావు మృతి చెందాడు. దీనిపై ఎస్ఐ ఎం. పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడలో వ్యక్తి అనుమానాస్పద మృతి

కాకినాడ క్రైం, సెప్టెంబరు 15: ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన ఆదివారం కాకినాడలో జరిగింది. త్రీటౌన్ సీఐ కేవీవీ సత్యనారాయణ కథనం ప్రకారం.. అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం, వీరవల్లిపాలేనికి చెందిన ముద్రగడ ఈశ్వరదుర్గాప్రసాద్ (39) కు భార్య నీలకంఠమణి, ఓ కుమారుడు ఉన్నారు. కాగా అతను కాకినాడలో లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఏడాది క్రితం జీవనోపాధి నిమిత్తం భార్య, కుమారుడితో కలిసి హైదరాబాద్ వెళ్లి పోయాడు. అయితే రెండు నెలల క్రితం భార్య, కుమారుడిని అక్కడ వదిలేసి స్వగ్రామానికి వచ్చి- తిరిగి హైదరాబాద్ వెళుతుండేవాడు. ఇది ఇలా ఉండగా కత్తుల దుర్గ అనే మహిళతో కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీధిలో కాస్మోహోటల్ పక్కన ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో ఏమైందో కాని ఆదివారం ఆ ఇంటి ప్రాంగణంలో ఈశ్వరదుర్గాప్రసాద్ ఒంటిపై దెబ్బలతో విగత జీవిగా పడిఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు కాకినాడ ఎస్‌డీపీఓ రఘువీర్ విష్ణు, సీఐ సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురికి తరలించారు. హత్యకు దారి తీసిన కారణాలు తెలియాల్సి ఉంది. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి విరాళాలు


విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, సెప్టెంబరు 15: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఇరువురు దాతలు రూ రెండు లక్షలు విరాళంగా అందజేశారు. జగ్గంపేటకు చెందిన బొండా సుబ్బరాజు రూ.లక్షను పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. కందుకూరుకు చెందిన మరోదాత ఎం.శ్రీకాంత్ రూ.లక్ష అన్నదాన విభాగ సూపరింటెండెంట్ కంచి మూర్తికి అందించగా వారు దాతలను అభినందించి స్వామివారి ప్రత్యేకదర్శనం, ప్రసాదాలు అందజేశారు.

ఏజెన్సీ సమాచారం

పస్తులుంటున్నా
పట్టించుకునే వారే లేరు

● సత్యసాయి సిబ్బంది ఆవేదన


శ్రీసత్యసాయి మంచినీటి పథకం

దేవీపట్నం, సెప్టెంబరు 15: ప్రజల దాహర్తి తీర్చేందుకు స్వర్గీయ సత్యసాయి నెలకొల్పిన మంచినీటి పథకం దాహర్తి తీర్చడానికి పనిచేస్తున్న సిబ్బందికి నెలలు తరబడి జీతాలు చెల్లించకపోవడంతో వారి బతుకులు రోడ్డున పడే పరిస్థితులు నెలకొన్నాయి. ఒకటి కాదు రెండు కాదు పదిహేను నెలలుగా జీతాలు రాక నానా అవస్థలు పడుతున్నారు. జీతాలు రాక కుటుంబాలు ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఎన్నోసార్లు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకునే నాధుడే లేకపోయాడు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను అడుగుతుంటే కాంట్రాక్టర్లను అడగమని చెబుతున్నారు. కాంట్రాక్టర్‌ను అడుగుతుంటే ప్రభుత్వం మాకు బిల్లు ఇస్తే ఇస్తామని లేకపోతే లేదనే సమాధానం చెబుతున్నాడని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లు తీర్చకపోతే మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని, ధర్నాకి కూడా స్పందించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయి వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కట్టుమూరు వీరబాబు తెలిపారు.

గురుకుల కళాశాలలో ఘనంగా ఇంజనీరింగ్ డే


మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాశాల సిబ్బంది

వై.రామవరం, సెప్టెంబరు 15: పి.యర్రగొండ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీరింగ్ డేను ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ శ్రీపాదరామకృష్ణ ఆధ్వర్యంలో విశ్వేశ్వరయ్య చేసిన సేవలను స్మరించుకున్నారు. విద్యార్థులు బావితరాలకు స్ఫూర్తి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వరద తగ్గినా.. తప్పని పాట్లు

● ఉదయ భాస్కరకాలనీవాసుల వెతలు


టీడీపీ కార్యాలయంలో తల దాచుకున్న వరద బాధితులు

కూనవరం, సెప్టెంబరు 15:వరద తగ్గినా మండల కేంద్రంలోని ఉదయభాస్కరకాలనీ ప్రజలు ఇంకా ఇంటికి చేరుకోని పరిస్థితి ఏర్పడింది. వచ్చిన వరదలకు ఇళ్లు పూర్తిగా మునిగిపోవడంతో బురదమయమయ్యాయి. దీంతో ఇంటికి వెళ్లలేక కొంతమంది రోడ్లపైన, పార్టీ కార్యాలయాల్లోను తలదాచుకునే పరిస్థితి ఏర్పడింది. మండల కేంద్రంలో టీడీపీ కార్యాలయంలో చాలా కుటుంబాలు అక్కడే తలదాచుకున్నాయి. ఇళ్లు పూర్తిగా ఎండాలంటే ఇంకా 10 రోజులపైనే పడుతుంది.

విచ్చలవిడిగా తెలంగాణ మద్యం సరఫరా

కూనవరం, సెప్టెంబరు 15: తెలంగాణకు సంబంధించిన మద్యం విచ్చలవిడిగా సరఫరా అవుతోంది. కొంతమంది వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా ఆయా షాపులకు సరఫరా చేస్తున్నారు. తెలంగాణ మద్యం ధర కొద్దిగా తక్కువగా ఉండడంతో మద్యంప్రియులు సైతం ఈ మద్యం కొనుగోలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి. రాత్రి వేళల్లో ఆటోలు, టాటా మ్యాజిక్‌ల్లో ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. కొంతమంది అధికారులకు తెలిసి ఈ మద్యం సరఫరా అవుతుందని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి.

'గ్రామ బహిష్కరణపై చర్యలు తీసుకోవాలి'

దేవీపట్నం, సెప్టెంబరు 15: మండలంలోని చొప్పకొండ పంచాయతీ పెద్దనూతులు గ్రామంలో కామారపు పండమ్మకు చెందిన జీడిమొక్కలు నరికేయడంతో పాటు ఆమెను గ్రామ బహిష్కరణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1985లో ప్రభుత్వం 140 జీడిమొక్కలు ఇవ్వగా సర్వే నెంబర్ 36లో 2-64 భూమిలో వేసుకున్నామని తన అత్త, భర్త తదానంతరం తాను ఫలసాయం పొందుతున్నట్లు తెలిపారు. అయితే ఈ భూమి మాదంటూ వలంటీర్ కోండ్ల రాంబాబురెడ్డి దౌర్జన్యంగా 21.06.2023లో 25చెట్లు నరికేశాడన్నారు. మరలా రెండవ దఫగా 115 చెట్లు నరికి పూర్తిగా తోట లేకుండా చేశారన్నారు. దీనిపై తహసీల్దార్, ఎస్ఐకు ఫిర్యాదు చేయగా వచ్చి తనిఖీ చేశారన్నారు. తాను న్యాయం కోసం ఊరి నుంచి బయటకు వెళ్లడంతో తనపై గ్రామ బహిష్కరణ పెట్టి ఊరి నుంచి వెలివేశారని ఆరోపించారు. నాతో మాట్లాడిన, ఇంటి పనికి వచ్చిన వారికి రూ.5వేలు జరిమానా అని తీర్మానం చేశారని ఫిర్యాదులో పండమ్మ పేర్కొంది. దీనిపై తనకు న్యాయం చేయాలని ఆమె కోరుతుంది.

ఘాట్ రోడ్డు ప్రయాణం నరకమే!

● తులసిపాక మారేడుమిల్లి రోడ్డు గోతులమయం
● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


అస్తవ్యస్తంగా ఉన్న తులసిపాక మారేడుమిల్లి ఘాట్ రోడ్డు

మోతుగూడెం, సెప్టెంబరు15: వాయుగుండం కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తులసిపాక మారేడుమిటిల్లి ఘాటీ రోడ్డు వెళ్ళే రహదారులు అత్యంత దారుణంగా మారాయి.ఎక్కడి ఎక్కడ గోతులుఏర్పడ్డాయి.వాటిలో వర్షపునీరుచేరడంతో గోతులు చెరువుల్లా మారాయి.వాహనదారులు ఈ రోడ్డులో వెళ్ళాలంటే నరకం చూస్తున్నారు.పగటిపూట ఎలాగోలా రాకపోకలు సాగిస్తున్నామని రాత్రి వేళల్లో ఈ రోడ్డు పై ప్రయాణం చేయాలంటే భయంగా ఉందని పలువురు వాపోతున్నారు.వర్షాలు పడినప్పుడల్లా గోతులు మరింత పెరిగిపోతున్నాయి. కన్నెత్తి చూసిన వారు కరువయ్యారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ రోడ్డుకు మరమ్మత్తులకు ప్రత్యేక దృష్టిని సారించవలసిందిగా వాహనదారులతో పాటు ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విజయవాడ వరద బాధితులకు
అనపర్తి ఏరియా రైస్‌మిల్లర్స్ రూ.5లక్షల చేయూత

అనపర్తి, సెప్టెంబరు 15: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు అనపర్తి ఏరియా రైస్‌మిల్లర్లు ముందుకు వచ్చారు. రైస్‌మిల్లర్లు రూ.5లక్షలు సమీకరించి ఆదివారం మండలంలోని రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి వెంకటరెడ్డి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడు తూ వరద బాధితులను ఆదుకునేందుకు అనపర్తి ఏరియా రైస్‌మిల్లర్లు పెద్ద మనస్సుతో రూ.5లక్షల విరాళం అందించ డం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు కర్రి వెంకటరెడ్డి, కార్యదర్శి మల్లిడి రా మ్మూర్తిరెడ్డి(పెద్ద), ఉపాధ్యక్షుడు ఎం.ఆదినారాయణమూర్తి, సంయుక్త కార్యదర్శి సూరపురెడ్డి వీర్రాజు(రాజేష్), కోశాధి కారి బలుసు శ్రీనివాసరావు, అనపర్తి ఏరియా రైసు మిల్లర్లు తేతల అబ్బూస్‌రెడ్డి పాల్గొన్నారు.


రూ.5లక్షల చెక్కును ఎమ్మెల్యే నల్లమిల్లికి అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు కర్రి వెంకటరెడ్డి

అనంత పద్మనాభ స్వామి వ్రత పుస్తకావిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 15: కోరుకొండ మండలం గాడాల శ్రీమహాలక్ష్మి పీఠంలో ఈనెల 17న 108 జంటలతో నిర్వహిస్తున్న అనంత పద్మనాభస్వామి వ్రతానికి సంబంధించిన వ్రత పుస్తకాన్ని పీఠం స్వామీజీ చిన్నవెంకన్న బాబు స్వామి ఆవిష్కరించారు. ఆదివారం రాజమహేంద్రవరం జయశ్రీ గార్డెన్స్‌లో పీఠం ఉభయ తెలుగురాష్ట్రాల చైర్మన్ మతల రమేష్ కార్యాలయంలో స్వామీజీ పీఠం జాతీయ చైర్మన్ దుర్గా వెంకట హేమావతి మాతతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. వ్రతంలో పాల్గొనాలనుకునే భక్తులు 86888 88999కు సంప్రదించాలని స్వామీజీ కోరారు. సింగంశెట్టి మహితోష్, పూర్ణి మ రాజ్, బిందు, అంబటి శ్రీనివాసరావు, మత రమేష్ పాల్గొన్నారు.

నర్సరీలు మరింత అభివృద్ధి చెందేలా కృషి

● లయన్స్‌క్లబ్ ఆఫ్ కడియం హార్టికల్చర్ ప్రమాణ స్వీకారం
● ముఖ్యఅతిథులుగా హాజరైన మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల


మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్లను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కడియం, సెప్టెంబరు 15: స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు సేవా కార్యక్రమాలు చేయడంలో ముందుండాలని 'లయన్స్ క్లబ్ ఆఫ్ కడియం హార్టికల్చర్' చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మంత్రి కందులదుర్గేష్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. ఆదివారం కడియపులంక నర్సరీ అసోసియేషన్ భవనంలో లయన్స్‌క్లబ్ కడియం హార్టికల్చర్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి లయన్స్‌క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు హాజరయ్యారు.

● లయన్స్‌క్లబ్ కార్యవర్గం

మాటూరి మంగతాయారు, పస్ట్‌వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వజ్ర పు కోటేశ్వరరావు, అధ్యక్షుడిగా పుల్లా ఆంజనేయులు(అబ్బులు), కార్యదర్శిగా కర్రి ఎస్సయ్య, కోశాధికారిగా నక్కా అమ్మిరాజు, లయన్స్‌క్లబ్ మెంబర్లు పుల్లా వీరవెంకట్రావు, పుల్లా పెదసత్యనారాయణ పుల్లా వీర్రాజు, పుల్లా చినసత్యనారాయణ, పుల్లా రామకృష్ణ, పుల్లా వీరబాబు, పుల్లా రాజశేఖర్ పాల్గొన్నారు.

● ముందుగా మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి లయన్స్‌క్లబ్ మెంబర్లుగా జాయిన్ అయ్యారు. అనంతరం కమిటీ అంతా కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్లను భారీ గజమాలలు వేసి, పూలకిరీటాలు పెట్టి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న లయన్స్‌క్లబ్ సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతుందని, అటువంటి సేవాసంస్థ లయన్స్‌క్లబ్ ఆఫ్ హార్టికల్చర్ కడియంలో ఏర్పడటంతో పాటు ఈ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. తాను, ఎమ్మెల్యే గోరంట్ల కలిసి కడియం నర్సరీలు అభివృద్ధి గురించి కలిసి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ కడియం పీహెచ్‌సీకి డయాలసిస్ సెం టర్, బ్లడ్ బ్యాంక్ తీసుకువచ్చి ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆరోగ్యమంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే గోరంట్ల తెలిపారు. కడియం నర్సరీలు మరింత అభివృద్ధి చెందాల్సి ఉందని కూటమి ప్రభు త్వం నర్సరీల అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, పంతం గణపతి, వెలుగుబంటి నాని, మల్లు పోలరాజు, ముద్రగడ జమీ, గట్టి నర్స య్య, పాటంశెట్టి రాంజీ, పల్ల సుబ్రహ్మణ్యం, రత్నం అయ్యప్ప,ఆది మూలం సాయిబాబా, తాడాల చక్రవర్తి, నాగిరెడ్డి రామకృష్ణ, మల్లు శివ, లయన్స్‌క్లబ్ మాటూరి మంగతాయారు, నర్సరీరైతులు ఈలి బేబి, మార్ని జానకిరామయ్య, నర్సరీ సంఘం ప్రతినిధులు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సినీ పరిశ్రమ ఏపీలో స్థిరపడేందుకు కృషి : మంత్రి దుర్గేష్


గ్రామ ప్రజలకు విజ్ఞప్తి సినిమా టైటిల్ అవిష్కరణ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 15: సినీ పరిశ్రమ ఆంధ్రపదేశ్‌లో స్థిరపడేందుకు కృషి చేస్తామని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం షెల్టన్ హోటల్‌లో 4కె ఫిలిం ఫ్యాక్టరీ బ్యానర్‌పై నిర్మిస్తున్న గ్రామ ప్రజలకు విజ్ఞప్తి సినిమా టైటిల్‌ను ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సినిమాల చిత్రీకరణకు కోనసీమ,తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు రంపచోడవరం తదితర అటవీ ప్రాంతాలు ఎంతో అనువైనవని అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ప్రేక్షకుల ఆదరణ తోనే చాలా సినిమాలు విజయవంతమయ్యాయన్నారు. తెలంగాణా రాష్ట్రతో పోల్చితే, మన రాష్ట్రం నైసర్గిక స్వరూపంలో పెద్దదైనప్పటికీ, సినిమా నిర్మాణానికి తగిన సౌకర్యాలు లేవని అన్నారు. సినిమా పరిశ్రమపై సీఎం చంద్రబాబు సదాభిప్రాయం ఉందని, సినీ పరిశ్రమ నుంచి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందాలనే స్థిర లక్ష్యంతో ఉన్నారని తెలిపారు. పలువురు ప్రముఖులు ఏపీలో సినిమా స్టూడియోలు ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని కోరారని చెప్పారు. ఇక్కడి నుంచి తెలంగాణాకు చిత్రపరిశ్రమ ద్వారా 63శాతం దాకా నిధులు వెళుతున్నాయన్నారు. ఏపీలో ఎందరో టెక్నీషియన్లు, కళాకారులు, ఆర్టిస్టులు ఉన్నారన్నారు. ఈ సినిమాకు ప్రముఖ హాస్యనటుడు గౌతమ్‌రాజు నేతృత్వం వహించడం అభినందనీయమన్నారు. సినిమా దర్శకుడు సాయి విజయ్ శ్రీరామ్, నిర్మాత ముంజులూరి పవన్ కు మార్, హీరో సందీప్,హీరోయిన్ కావేరి, చిత్రయూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం


ట్రైనింగ్ కాలేజీలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల కలయిక

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 15: రాజమహేంద్రవరం ట్రైనింగ్ కాలేజీ ఆవరణలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పాఠశాలలో 1975-80 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని సందడి చేశారు. నాడు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సత్కరించారు. పూర్వవిద్యార్థుల సంఘం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులకు రూ.50వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో ఇమ్మిడి ప్రసాద్, సీహెచ్ రామకృష్ణ, బోడ కిషోర్, గండేపూడి శ్రీనివాస్, ముత్తంగి వేణుగోపాల్ పాల్గొన్నారు.

20 నుంచి విశిష్ట వ్యక్తులకు సత్కారాలు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 15: స్థానిక జిత్ మోహన్ మిత్ర కళావేదికలో ఈ నెల 20 నుంచి 28వరకు విశిష్ట వ్యక్తులకు సత్కారం, బిరుదు ప్రదానం జరుగుతుందని కళావేదిక అధ్యక్షుడు జిత్‌మోహన్ మిత్ర తెలిపారు. ఈ కార్యక్రమాలకు సాహిత్యప్రియులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

'సుధాకర్ వర్మసేవలు ఆదర్శప్రాయం'

కోరుకొండ, సెప్టెంబరు 15: కోరుకొండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సీఈవో గొల్లిముక్కల సుధాకర్ వర్మ అందించిన సేవలు అందరికీ ఆదర్శప్రాయమని కూట మి నాయకులు పేర్కొన్నారు. కోరుకొండ మండలం కణుపూరు స్వయంభు భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారి కొండవద్ద జరిగిన సుధాకర్ వర్మ ఆదివారం అభినందన సత్కార సభ పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. 48 సంవత్సరాలపాటు సుధాకర్ వర్మ కోరుకొండ సొసైటీ సీఈవోగా సేవలు అందించి అందరి మన్ననలు అందుకున్నారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు పుల్లెపు వీరన్న కాపు, నాగా రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కోరుకొండ మండలానికి చెందిన సొసైటీ సీఈవోలు, కో ఆపరేటివ్ బ్యా ంక్ బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ మాజీ అధ్యక్షుడు, సహకారసంఘ ఉద్యోగులు సుధాకర్ వర్మ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రొంగల శ్రీనివాసు, చలగంశెట్టి శ్రీనివాసు పలువురు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మోక్షగుండం 163వ జయంతి

ధవళేశ్వరం,సెప్టెంబరు 15: గ్లోబల్ ఇంజనీర్ మోక్షగుం డం విశ్వేశ్వరయ్య 163వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయ సమీపంలో ఉన్న విశ్వేశ్వరయ్య విగ్రహానికి ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఈ శ్రీనివాసరావు మా ట్లాడుతూ నీటిపారుదల రంగంలో ఎనలేనిసేవలు అందించి గ్లోబల్ ఇంజనీర్ ఆఫ్ ఇండియాగా గౌరవం అందుకున్న విశ్వేశ్వరయ్య నేటి ఇంజనీర్లకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. కార్యక్రమంలో డీఈ రమేష్, ఏఈ అద్దంకి సాయిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణమ్మ గీతాలతో పులకించిన కళాగౌతమి

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 15: కందుకూరి వీరేశలింగం కళాశాలలోని నాటక సమాజం హాలులో కళాగౌతమి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రచయితల సమావేశం జరిగింది. రచయితల సమావేశంలో, కవులు, రచయితలు పాల్గొని, చక్కని కవితలు వినిపించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్రాంత ఆచార్యులు చిలుకూటి కూర్మయ్య మాట్లాడుతూ నది అంటేనే ఒక గతి, కమనీయ శ్రుతి,రమణీయ జతి అని అన్నారు. ఈ సభను ప్రారంభించిన వీపీబీ సంజీవరావు మాట్లాడుతూ అంధ్రరాష్ట్రంలోని చలన చిత్ర పరిశ్రమకు నదులు ఆయువుపట్టు వంటివని అన్నారు. ఒక దశలో చిత్ర గీతాలలో కృష్ణాగోదావరీ నదుల మీద చరణాలు,పల్లవులు, లేకుండా సినిమాలు ఉండేవి కావంటే అతిశయోక్తి లేదన్నారు. జేతా శారదాదేవి ప్రార్థనతో ప్రారంభమైన కవితా గోష్ఠి కార్యక్రమంలో బీహెచ్ రామాదేవి, చీరల సీతారామనాయుడు, జి.వినయ్, టి.శంకర్, నాగసాయి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఆటో డ్రైవర్ల సర్వీసు ఛార్జీలు పెంచాలి : ఏఐటీయూసీ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 15: ఆన్‌లైన్‌లో బుక్ చేస్తున్న రాపిడ్, ఊబర్, ఓలా ఆటో డ్రైవర్లకు యాజమాన్యాలు వసూలు చేస్తున్న సర్వీస్ ఛార్జీలు పెంచాలని, కనీసం రూ.60 ఉండాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ది రాజమండ్రి ఆన్‌లైన్ రాపిడ్, ఊబర్, ఓలా ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మధు పాల్గొని మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విజయవాడ వరద బాధితులకు విరాళం

రాజమహేంద్రవరం కల్చరల్/సిటీ, సెప్టెంబరు 15: విజయవాడలోని భట్రాజు వరద బాధితులకు ఆర్థికసాయం అందజేశారు. రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ ఉద్యోగి, భట్రాజుల సంఘం జిల్లా అధ్యక్షుడు లోలభట్టు శ్రీనివాసరాజు సంఘ సభ్యుల సహకారంతో విజయవాడలోని కండ్రిక మెయిన్ రోడ్డులో ప్రభుత్వ పరీక్షా కేంద్రం వద్ద బాధితులకు రూ1.50 లక్షలు ఆర్థిక సాయం అం దించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి రాజమహేంద్రవరంలోని 12వ డివిజన్‌కు చెందిన మేకా పాపారావు స్థానిక తిలక్ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు రూ.10 వేలను విరాళం అందించారు. కార్యక్రమంలో కంటిపూడి రాజేంద్రప్రసాద్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి స్వచ్ఛతా-హి- సేవ

రంగంపేట,సెప్టెంబరు 15: స్వచ్ఛ భారత్ దినోత్సవం సందర్భంగా ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు మండలంలో స్వచ్ఛతా-హి- సేవ 2024 నిర్వహిస్తున్నామని రంగంపేట మండల ఎంపీడీవో పి.వెంకటరత్నం అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడారు ప్రకృతి శుభ్రత-సంస్కార పరిశుభ్రత ధ్యేయంతో జరిగే ఈ కార్యక్రమం ఈనెల 17నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు జిల్లా, రాష్ట్ర, గ్రామ పంచాయతీస్థాయిల్లో పక్షోత్సవంగా నిర్వహిస్తామని, అక్టోబరు 2న స్వచ్ఛభారత్ దివస్‌తో కార్యక్రమం ముగిస్తామన్నారు. స్వచ్ఛతా-హి-సేవ కార్యక్రమంలో పారిశద్యంలో ప్రజాస్వామ్యం, సంపూర్ణ పరిశుభ్రత, పారిశుద్య సేవకుల భద్రతా శిబిరాలు అనే మూడు విభాగాలుగా ఈ కార్యక్రమం రోజువారీగా నిర్వహిస్తామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ ఉద్యోగులంతా స్వచ్ఛ ప్రతిజ్ఞ కార్యాలయాల్లో చేస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ, జిల్లా కలెక్టర్, అధికారులు, మండలం, గ్రామంలో ఉన్న కూటమి నాయకులు, ఉద్యోగులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కోడి కిషోర్‌కు జాతీయ అవార్డు ప్రదానం

రాజానగరం, సెప్టెంబరు 15 : మండలంలోని కానవరం గ్రామానికి చెందిన మానవ హక్కులకై పోరాడు సాధించు ఉద్యమ సంస్థ జిల్లా అధ్యక్షులు కోడి తాతారావు అలియాస్ కిషోర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు లభించింది. ఈమేరకు బెంగళూరు జక్కుర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ భవనంలో సోమలరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిపబ్లిక్ పార్టీ జాతీయ కార్యదర్శి, కేంద్ర న్యాయశాఖామంత్రి సెక్రటరీ పేరం శివనాగేశ్వరరావుగౌడ్, కర్ణాటక హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణప్రసాద్ సతీమణి నందిని ఆదివారం అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా కిషోర్ మాట్లాడుతూ తాను చేసిన సేవలకు గుర్తింపుగా నేషనల్ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన వారందరికీ అభినందనలు తెలిపారు.

ఏపీలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, సెప్టెంబరు 15: రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృ ష్ణారెడ్డి అన్నారు. ఆదివారం రామవరంలోని నల్లమిల్లి మూ లారెడ్డి సత్యవతికాలనీలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ భారతదేశ కీర్తి ప్రతిష్టలను పెంపొందించిన ప్రధాని మోదీ నాయకత్వం దేశానికి ఎంతో అవసరమన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతంగా జరుగుతుందని అనపర్తి నియో జకవర్గం సభ్యత్వ నమోదులో రికార్డు సృష్టించాలని దీనికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గిరిడా గంగాభవాని, మాజీ సర్పంచ్ తేనెల శ్రీని వాస్, చింతా సురేష్‌రెడ్డి, నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


రాజానగరంలో ఊరేగుతున్న భారీ గణనాథుడు

గణపతి బప్పా మోరియా

● ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవాలు

రాజానగరం, సెప్టెంబరు 15 : గణపతి నవరాత్రి మహోత్సవాల్లో ప్రత్యేక మండపాల్లో కొలువుతీరిన గణనాధులను బ్యాండ్ మేళాలు, బాణా సంచాలతో ఆదివారం గ్రామోత్సవాలు నిర్వహించారు. గతవారం తొమ్మిది రోజులుగా భక్తుల పూజలందుకున్న బొజ్జగణపయ్యల నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాలతో పాటుగా భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. గణపతి బప్పా మోరియా అంటూ ఉరకలేసే ఉత్సాహంతో యువత, చిన్నారుల కోలాహలం నడుమ ఊరేగింపు కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం విగ్రహాలను కలవచర్లలోని పుష్కర, పోలవరం కాలువల్లో నిమజ్జనం చేశారు.

దివాన్‌చెరువు: దివాన్‌చెరువు బీజాపురి టౌన్‌షిప్‌లో శ్రీలక్ష్మీగణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం లక్ష్మీగణపతి హోమంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు సందర్భంగా అన్నవరం దేవస్థానం విశ్రాంత అధికారి పోలినాటి గోవిందరావు, ఇస్కాన్ నుంచి సత్యగోపీనాథ్‌దాస్ ప్రభూజీ, ప్రవచనకర్త బొల్లా శ్రీనివాస్ ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారని శ్రీలక్ష్మీగణపతి ఉత్సవ కమిటీ ఆదివారం తెలిపింది.అలాగే పాలచర్లలో గణపతి నవరాత్రులలో భాగంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని జనసేన పార్టీ కోఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి స్వామివారిని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గంగిశెట్టి చంటిబాబు, వసంతరాయుడు, గంగిశెట్టి రాజేంద్ర, సూరపురెడ్డిరాజారావు, దాసరిశ్రీను, తిరుమలశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: గత 9రోజులుగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన మండపాల్లో పూజలు అందుకున్న గణనాదుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి గోదారమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. ఆదివారం గ్రామంలోని పలు ప్రాంతాలతో పాటు సమీప ప్రాంతాల్లోని గణపయ్యను భక్తుల కోలాహలం భాజాభజంత్రీల మధ్య ఊరేగింపుగా రామపాదాల రేవుకు చేరుకోగా పంచాయతీ సిబ్బంది ఏర్పాటుచేసిన పంటుపైకి చేర్చి గోదావరిలో నిమజ్జనం చేశారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సీఐ గణేష్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. రథం వీదిలోని యడ్ల మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటైన వినాయక మండపంలో ఉదయం గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గోకవరం: మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో గణేషుడి విగ్రహ నిమజ్జనం ఆదివారం ఘనంగా జరిగింది. పలువురు యువకులు, చిన్నారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముందుగా విగ్రహాన్ని ట్రాక్టర్‌పై గ్రామమంతా ఊరేగించారు. డీజే సౌండ్లతో సందడి చేశారు. అనంతరం సమీపంలోని చెరువులో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.


పాలచర్లలో వినాయక కమిటీ సభ్యులతో బత్తుల వెంకటలక్ష్మి


ధవళేశ్వరంలో గణపతి హోమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా వరసిద్ది వినాయక నవరాత్ర మహోత్సవ వేడుక

అనపర్తి: అనపర్తిలోని ఐఎల్‌టీడీ సాయిబాబా మందిరంలో నెలకొల్పిన వరసిద్ది వినాయక నవరాత్ర మహోత్సవ వేడుకను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణపతి హోమ కార్యక్రమానికి ఎమ్ఎస్ఆర్ విద్యా సంస్థల అదినేత మల్లిడి అనంతరెడ్డి మాదవి దంపతులు కర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అదిక సంఖ్యలో భక్తులు వేడుకలలో పాల్గొన్నారు.

లాటరీలో చిన్నారికి దక్కిన కిలో లడ్డూ ప్రసాదం


బీజాపురి టౌన్‌షిప్‌లోశ్రీలక్ష్మీగణపతిని దర్శించుకున్న భక్తులు



అనపర్తి: కిలో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న చిన్నారి మనస్వి

అలాగే అనపర్తి శేషగిరావు పేట సాయిరామ్ మందిర్‌లో ఏర్పాటుచేసిన గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని లాటరీ ద్వారా అంది ంచాలని సంకల్పించారు. ఆదివారం ఆలయ కమిటీ ప్రతినిధులు పడాల కళ్యాణ్‌రెడ్డి, చింతా ప్రకాశరెడ్డిల ఆధ్వర్యంలో లాటరీ నిర్వహించారు. 11కిలోల లడ్డూ ప్రసాదం పెద్దలకు లాటరీ నిర్వహించగా గ్రామానికి చెందిన అయ్యప్పరెడ్డి దక్కించుకోగా చిన్నారుల కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన కిలోల డ్డూ ప్రసాదానికి లాటరీ తీయగా గ్రామానికి చెందిన మనస్వి అనే చిన్నారి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకుంది. వీరిరువురికి ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా గణపతి నవరాత్రి మహోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక ఉత్తర వీధిలోని విద్యాగణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం వెంకటరమణ, కళ్యాణి దంపతులు గణపతి హోమం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన భక్తి సంగీతం, కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గాడేపల్లి సత్యనారాయణమూర్తి, గాడేపల్లి అన్నపూర్ణ, దంతూరి ప్రసాద్, బుర్రా రవికుమార్, దివాకర్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక నందివాడ వారి వీధిలో వజ్రగణపతి ఆలయంవద్ద పేరూరి సూర్యనారాయణ, అమ్మాజీ దంపతులు వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. పురోహితులు ఏకాదశ హారతులిచ్చారు. హేమలత ఆధ్వర్యంలో జయరామ్ శ్రీనివాస భజనమండలి భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వాకచర్ల కృష్ణ, పొత్తూరు యతిరాజ్, సంపత్‌కుమార్, సరిదే ధనవెంకటేశ్వరరావు, ఆషా, సుమ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

సోమవారం 16 సెప్టెంబరు 2024 | 5



కొవ్వూరులో క్రేన్‌తో గణపతి నిమజ్జనం

కచ్చులూరు..



కన్నీళ్లు!

కచ్చులూరు ఘోర కలికి ఐదేళ్లు

- ఐదేళ్ల కిందట గోదారిలో పెను ప్రమాదం
- అప్పట్లో 49 మంది పర్యాటకులు మృతి
- కనీవినీ ఎరుగని రీతిలో 38 రోజులు ఆపరేషన్
- అతి కష్టం మీద బోటు వెలికితీత
- అప్పటికీ.. ఇప్పటికీ ఇదొక పెను విషాదమే

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గోదారిలో కన్నీటికి ఐదేళ్లు.. నాడు పాపికొండలు విహారయాత్ర విషాదంగా మారింది.. ఆ సంఘటన పాపికొండల పర్యాటకానికి వెళ్లేవారిలో తీవ్ర భయాన్ని నింపింది. ఎందుకంటే 49 మంది పర్యాటకులు గోదావరిలో జల సమాధి అయి ఐదేళ్లయింది.. సరిగ్గా 2019 సెప్టెంబరు 15వ తేదీన 77 మందితో వెళుతున్న పర్యాటక బోటు కాస్తా గోదావరి సుడిగుండంలో చిక్కుకుంది. అప్పట్లో 26 మందిని స్థానిక జాలర్లు కాపాడినా 49 మంది ప్రాణాలు కోల్పోయారు. దేవీపట్నం మండలం కచ్చులూరు వద్ద జరిగిన ఈ ఘోర దుర్ఘటన ఇప్పటికీ గోదావరి ప్రజలకు కళ్లెదుట సాక్షాత్కరిస్తూనే ఉంది.ఆనాటి ఘోర సంఘటనను తలచుకుంటేనే కంట కన్నీళ్లే ... చాలా జీవితాల్లో నేటికీ ఆ కన్నీరు విషాదకలిగా మిగిలే ఉంది. పాపికొండలు విహారయాత్రలో అయినవారిని కోల్పోయినా అనేక మంది నది ఒడ్డునే రోజుల తరబడి అన్వేషించారు. అయిన వారు కానరాక, తిండీతిప్పలు లేక రోదనలతో తిరుగాడినవారెందరో. చిన్నారులను కోల్పోయిన కొందరు, భార్యల కడసారి చూపుకైనా నోచుకోవాలని ఇంకొందరు, కనిపించకుండా పోయిన తల్లిదండ్రుల కోసం రెప్పలమాటున కన్నీరుబుకుతుండగా విషణ్ణ వదనాలతో వేచి చూసినవారు ఇంకొందరు. పాపికొండలు విహార యాత్ర అంటే జనం అమితాసక్తి చూపేవారు. ప్రకృతి అందాలకు నెలవైన పాపికొండలు విహారయాత్ర తమ జీవితానికి గొప్ప అదృష్టమంటూ మురిసిపోయిన వారెందరో. దూరభారమైనా పిల్లాపాపలతో ఒక రోజు అయినా గోదావరి నదిలో గడిపామన్న తృప్తి మిగుల్చుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చేవారు. ఈ క్రమంలోనే 2019 సెప్టెంబరు 15న గోదావరి ఒడ్డున గండిపోచమ్మ దేవాలయం వద్ద వశిష్ఠ పున్నమి రాయల్ పర్యాటక బోటులోకి అప్పటికే నిర్దేశించిన పర్యాటక ప్రియులంతా తమవారితో కలిసి ఎక్కారు. గండిపోచమ్మ దేవాలయం నుంచి దాదాపు మూడున్నర గంటల పాటు ప్రయాణించి బోటు ముందుకు సాగుతుంది.. మరో నాలుగు గంటల్లో పాపికొండలుకు బోటు చేరుకోవాల్సి ఉండగా దేవీపట్నం మండలం కచ్చులూరు గ్రామం సమీపాన గోదావరి అతి వేగంగా ప్రయాణిస్తూ ఓ సుడిగుండంలా ఏర్పడి ఉంది. 77 మంది పర్యాటకులతో గోదావరిలో ప్రయాణిస్తున్న వశిష్ఠ బోటు కాస్తా ప్రవాహానికి ఎడమవైపున వెళ్లాల్సి ఉండగా కుడి వైపున ప్రయాణించి సుడిగుండంలో చిక్కుకుంది. ఒక్కసారిగా హాహాకారాలతో పర్యాటకులంతా కేకలు వేసినా ఫలితం లేకుండాపోయింది. అప్పటికే గోదావరిలో ఐదు లక్షల క్యూసెక్కులకుపైగా వరదనీరు ప్రవహిస్తోంది. ఒకవైపు వరద ఉధృతి.. మరో వైపు క్షణాల్లోనే బోటు సుడిగుండంలో ఒరిగిపోయింది. అప్పటికే సమీపాన మత్స్యకారులు జరిగిన ప్రమాదాన్ని గమనించి అప్రమత్తమయ్యారు. క్షణాల్లోనే వేగంగా అక్కడికి చేరుకుని 26 మందిని రక్షించి ఒడ్డుకు తీసుకెళ్లగలిగారు. అప్పటికే పర్యాటక బోటులో ఉన్న 49 మందితో బోటు కాస్తా గోదావరిలో మునిగిపోయింది. రాష్ట్రమంతటా ఈ ఘటన పెను విషాదాన్ని సృష్టించింది. మునిగిపోయిన పర్యాటక బోటును బయటకు తీయడానికి కాకినాడకు చెందిన ధర్మాడి సత్యం బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దించింది. 38 రోజుల పాటు శ్రమించి అప్పట్లో అక్టోబరు 21వ తేదీన బోటును వెలికితీయగలిగారు. మరో వైపు ఇప్పటికీ ప్రమాదంలో మృతుల సంఖ్యపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో బోటులో ఉన్నవారి సంఖ్యపై సరైన సమాచారం లేదు. ఈ ఘోర దుర్ఘటన అప్పటికీ ఇప్పటికీ పాపికొండలు పర్యాటక ప్రియులను కలచివేస్తూనే ఉంది. కచ్చులూరు దుర్ఘటన అనంతరం కొన్నాళ్ల పాటు పాపికొండలు యాత్రను ప్రభుత్వం నిలిపివేసింది. బోటులో ప్రయాణించే వారి రక్షణ చర్యలు పూర్తిగా గమనించిన తర్వాత ప్రయాణించే బోటు సామర్థ్యాన్ని ముందుగా నిర్ధారణ చేసిన తర్వాతే పాపికొండలు యాత్రకు అనుమతిస్తూ వస్తున్నారు.

పనిచేస్తుండగానే.. ప్రాణం పోయింది..

పనిలో పడి గమనించని విద్యుత్ తీగలు.. షాక్‌తో డ్రైవర్ మృతి



నల్లజర్ల,సెప్టెంబరు 15 : వరి కోత మిషన్ డ్రైవర్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. నల్లజర్ల మండలం పడమర చోడవరం గ్రామానికి చెందిన తానింకి నాగేంద్ర(30) అదే గ్రామానికి చెందిన నూనేసత్యనారాయణకు చెందిన వరి కోత మిషన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.ఆదివారం అనంతపల్లి గ్రామానికి చెందిన రైతుకు చెందిన వరి పొలం కోతకు రావడంతో కోత ప్రారంభించారు.మిషన్ ట్యాంకు నిండిపోవడంతో ధాన్యం ట్రాక్టర్‌లోకి పోసే క్రమంలో ధాన్యం బయటకు రాలేదు. దీంతో నాగేంద్ర ట్యాంకుపైకి ఎక్కి సరిచేసే క్రమంలో పైనే ఉన్న 11కేవి విద్యుత్ వైర్లు చేతికి తగిలి అక్కడిక్కడే మృతిచెందాడు.మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం తాడేపల్లిగూడెం తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.మృతుడికి భార్య రాణి,ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రేపు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ


రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 15 : నులిపురుగులతో పిల్లల్లో రక్తహీనత ఏర్పడుతుందని, దీని నివారణకు పిల్లలు తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబరు 17న నేషనల్ డీ వార్మింగ్ డే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 3,400 ఇన్‌స్టిట్యూషన్స్‌లో నులిపురుగుల నివారణ దినంకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. అంగన్వాడీ సెంటర్లతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలు, ఇంజనీరింగ్ కళాశాలలు తదితర అన్నింటిలోనూ మాత్రలు వేయడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల సహకారంతో జిల్లావ్యాప్తంగా తగిన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

బై..బై..గణేశా..



ఉండ్రాజవరం మండలం వేలివెన్నులో గణపతి ఊరేగింపునకు సిద్ధమైన రథం

జై జై గణేశా అంటూ 9 రోజుల కిందట ఊరూవాడా గణపతి విగ్రహాలు ప్రతిష్ఠించారు.. ఆదివారానికి నవ రాత్రులు పూర్తవడంతో బై బై గణేశా అంటూ విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం, కొవ్వూరు గోదావరి రేవుల్లో పెద్ద ఎత్తున విగ్రహాలను నిమజ్జనం చేశారు.



వెళ్లిరా..గణేశా..



రాజమహేంద్రవరంలో నిమజ్జనానికి గణేశులు

అడవిని వదిలి.. జనారణ్యంలోకి..



ఇదే పాపికొండలు అభయారణ్యం

చిరుత ఎందుకొచ్చింది.. ఎలా వచ్చింది..

అమ్మో పులి.. రాజమహేంద్రవరంలో ఉందట.. ఎవరి నోటా విన్నా ఇదే మాట.. ఎక్కడ నుంచి వచ్చిందో.. ఎలా వచ్చిందో... ఎందుకు వచ్చిందో అంటూ రకరకాల ప్రశ్నలు.. ఒక్కప్రశ్నకూ అంతుచిక్కదు.. మరో వైపు అటు వైపు వెళితే ఏం జరుగుతుందోననే భయం.. గత 10 రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదీ పరిస్థితి. అసలు పులి ఎక్కడ నుంచి.. ఎలా వచ్చి ఉంటుంది... ఇక్కడికే ఎందుకు వచ్చింది.. అసలేం చేస్తుందనే దానిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అడవి నుంచి దారి తప్పి జనారణ్యంలోకి చిరుత పులి ఎలా రాగలిగింది? చిరుత పులులకు ఆవాసంగా ఉన్న పాపికొండలు అభయారణ్యం నుంచి గోదావరి నది మీదుగా వచ్చిందా...లేదా అదే అభయారణ్యం విస్తరించి ఉన్న రంపచోడవరం,మారేడుమిల్లి మీదుగా వచ్చిందా? అటవీ శాఖ రకరకాల విశ్లేషణలు చేస్తోంది. రోజుకు వంద కిలో మీటర్లకుపైగా నడిచే చిరుత పులి ఎన్ని రోజుల పాటు నడుచుకుని ఇక్కడకు వచ్చింది? అనే దానిపై అటవీ శాఖలో చర్చ సాగుతోంది. భారీ వర్షాలు, వరద లకు అడవుల్లో చిరుతపులి స్థావరం దెబ్బతింటే అక్కడి నుంచి సురక్షిత స్థావరం వెదికే క్రమంలో దారితప్పి ఉంటుందని అనుమానిస్తున్నారు. చిరుత పులి స్థావరంలోకి పెద్ద పులి వస్తే తక్షణం ఉండే ప్రాంతాన్ని మార్చడం చిరుత లక్షణం కావడంతో ఆ క్రమంలో దారితప్పి ఉంటుందని భావిస్తున్నారు.ఈ క్రమంలో గోదావరిని ఈదుకుంటూ రావడం లేదా రంప అడవుల నుంచి గోకవరం మీదుగా రాజమహేంద్రవరంలోకి వచ్చేసి ఉంటుందని విశ్లేషిస్తున్నారు. ఇంకో పులితో జత కట్టిన తర్వాత ఆడ, మగ పులి విడిపోతాయి.ఇలా మళ్లీ జత కోసం ప్రయత్నించే సమయంలో దారితప్పి నగరంలోకి వచ్చి ఉంటుందని చెబుతున్నారు.గతంలో ఉమ్మడి జిల్లాలకు దారితప్పి వచ్చిన చిరుతల ఘటనలతో పోల్చి విశ్లేషణలు చేస్తున్నారు.

10 రోజులైనా చిక్కని చిరుత..

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం శివారులోని 900 ఎకరాల రిజర్వు ఫారెస్టులో పది రోజుల నుంచీ చిరుత హంగామా సంచరిస్తూ అటవీ అధికారులకు మాత్రం చిక్కడం లేదు. పట్టుకొని తీరుతామని అటవీ అధికారులు.. పట్టుకోండి చూద్దామంటూ చిరుతపులి ప్రతిరోజూ సవాళ్లు విసురుకుంటూనే ఉన్నారు. అటవీ అధికారులు అమర్చిన 50 ట్రాప్ కెమెరాల్లోని ఎక్కడో అక్కడ చిరుత ఫొటోకు ఫోజు ఇచ్చి వెళ్లిపోతోంది. ఆ కెమెరాలను అటవీ సిబ్బంది తనిఖీ చేసే సమయానికి పుణ్యకాలం గడిచిపోతోంది. 50 మంది సిబ్బందితో కూడిన బృందాలు ఏ ప్రయత్నాలు చేస్తున్నా నాలుగు బోన్‌లలో ఒక్క దాంట్లోకీ చిరుత దూరడం లేదు. థర్మల్ డ్రోన్‌ని వినియోగించినా ఫలితం కానరావడం లేదు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు, ఆటోనగర్, దివాన్ చెరువు, శ్రీరాంపురం తదితర ప్రాంతాల ప్రజలు మాత్రం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రణాళికలు..విశ్లేషణలు.. ప్రకటనల మాట ఎలా ఉన్నా భయభ్రాంతులకు గురవుతున్నారు.

ఎలా వచ్చిందంటే...



చిరుత వచ్చింది ఈ దారిలోనేనా..?

పాపికొండలు అభయారణ్యం నుంచే చిరుతపులి దారితప్పి వచ్చిందని చెబుతున్నారు. ఎందుకంటే పులులు, చిరుత పులులకు పాపికొండలు అభయారణ్యం పెట్టింది పేరు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, అల్లూరి సీతారామరాజు జిల్లా వీటి పరిధిలోని ఏజెన్సీ కలిపి మొత్తం 1.02 లక్షల హెక్టార్లు అంటే 2.60 లక్షల ఎకరాలు.ఈ కొండల మధ్యలో గోదావరి ఉంది. ఈ అభయారణ్యం పులులకు ఆవాసం. మూడేళ్లకోసారి కెమెరా ట్రాప్ ద్వారా పులుల లెక్కింపును అధికారులు చేపడతారు. ఇటీవల ఈ అభయారణ్యంలో అధికారులు రెండు దశల్లో 232 ట్రాప్ కెమెరాలతో 116 ప్రాంతాల్లో సర్వే చేయగా నాలుగు పెద్దపులులు,ఆరు చిరుత పులులు ఉన్నట్టు గుర్తించారు. ట్రాప్ కెమెరాకు చిక్కని చిరుత పులులు మాత్రం ఇంకో 12 వరకు ఉండొచ్చని అంచనా. రంపచోడవరం, మారేడుమిల్లి అడవుల్లోనూ చిరుతల సంచారమే అధికమని అక్కడ పనిచేసిన అటవీ అధికారులు చెప్తున్నారు. రాజమహేంద్రవరంలోకి దారితప్పి వచ్చిన చిరుత పాపికొండలు అభయారణ్యం నుంచే వచ్చిందని చెబున్నారు. ఇటీవల గోదా వరికి వరద పోటెత్తడంతో అడవుల్లో చిరుత స్థావరం చెల్లాచెదురై కొత్త స్థావరం కోసం వెదికే క్రమంలో గోదావరి ఈదుకుంటూ రాజమహేంద్రరంలోకి వచ్చి ఉండొచ్చని అంచనా. పాపికొండలు అభయారణ్యం విస్తరించిన ఏజెన్సీ ప్రాంతంలోను వీఆర్‌పురం, రంపచోడవరం, మారేడుమిల్లి, గోకవరం మీదుగా చిరుత రాజమహేంద్రవరంలోకి దారి తప్పి వచ్చి ఉండొచ్చని చెప్తున్నారు.ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి పోలవరం ప్రాజెక్టు మీదుగా రంప ఏజెన్సీ వరకు విస్తరించి ఉన్న పాపికొండలు అభయారణ్యంలో ఎటువైపైనా పులులు దారి తప్పవచ్చని విశ్లేషిస్తున్నారు.

అందుకే కదలడం లేదా...

ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏలూరు జిల్లా పరిధిలోకి ఓ మగ పులి పాపికొండలు అభయారణ్యంలోకి వచ్చింది. వంద కిలోమీటర్లకుపైగా నడిచి తిరిగి అభయారణ్యంలోకి వెళ్లిపోయింది. పాపికొండలు అభయారణ్యాన్ని ఆనుకుని కొండలు, గోదావరి నది ద్వారా పులి సంచరించి ఇలా వచ్చిందని అప్పట్లో భావించారు. 2022 మేలో ఓ పులి ఏజెన్సీ మీదుగా ప్రత్తిపాడు, శంఖవరం, తుని రూరల్ మీదుగా వెళ్లింది. ప్రత్తిపాడులో బోనులోకి చిక్కినట్లే చిక్కి తప్పించుకుంది.ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, ఏజెన్సీ ప్రాంతాల మీదుగా విస్తరించి ఉన్న అడవుల నుంచి కొన్నిసార్లు దారితప్పడం వలనే ఈ ఘటనలు చోటుచేసుకుంటున్నట్టు చెప్తున్నారు. ఇప్పుడు రాజమహేంద్రవరంలోకి చిరుతపులి రావడం క్రమేపీ నగరాల్లోకి దారితప్పి వస్తున్న పులుల సంచారం చర్చనీయాంశంగామారింది.రాజమహేంద్రవరంలో సంచరిస్తున్న చిరుత రిజర్వు ఫారెస్టులో ఉంది. అనువైన వాతావరణం ఉండడంతో అక్కడి నుంచి కదలట్లేదని సమాచారం.

చిరుత కంటే తక్కువ ఎత్తు ఉంటేనే దాడి..

పులి, చిరుత పులికి చాలా వ్యత్యాసాలున్నాయి. పులి జాడ ఉన్న చోట చిరుతపులి పెద్దగా ఉండదు. కానీ చిరుతపులితో పోల్చితే పులి చాలా తెలివైనది. ఇది పెద్దగా జనావాసాల్లోకి రాదు. ఒకేచోట ఎక్కువగా ఉంటుంది.చిరుత అలా కాదు. ఇది నిరంతరం తిరుగుతూనే ఉంటుంది. వంద కిలోమీటర్లు అవలీలగా నడిచేస్తుంది. పులి కేవలం ఆకలి వేస్తేనే వేటాడుతుంది. చిరుతపులి అలా కాదు.చిరుత లక్షణం నిరంతరం ఏదొకటి వేటాడుతూ తింటూ ఉండడమే. ఇది తక్కువ ఎత్తయిన జంతువులు పంది,కుక్కలను వేటాడి తింటుంది. ఎత్తయిన జంతువులను చిరుత వేటాడలేదు. మనుషులు ఎత్తుగా ఉండడం వల్ల మనుషులను చూస్తే చిరుత కొంత భయపడుతుంది.అదే కూర్చుని ఉంటే తక్కువ ఎత్తు వల్ల సులువుగావేటాడుతుందనిఅటవీ అధికారులు విశ్లేషించారు.

- రాజమహేంద్రవరంలోనే చిరుత
- ఇంకా కొనసాగుతున్న అన్వేషణ
- పాపికొండలు అభయారణ్యం నుంచే రాక?
- ఇక్కడకు రావడానికి కారణాలపై విశ్లేషణలు
- ఎలా వచ్చిందనే దానిపై ఇంకా అస్పష్టత
- పులి కంటే చిరుతపులే ప్రమాదకరం
- ఆకలి వేసినప్పుడే పులి వేట..
- చిరుతది నిరంతర వేట

పిల్లలను బయటకు రానీయవద్దు : డీఎఫ్‌వో

దివాన్‌చెరువు, సెప్టెంబరు 15: దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో అమర్చిన ట్రాప్ కెమెరాలో ఆదివారం తెల్లవారుజామున చిరుతపులి కదలిక చిత్రాలు కనిపించాయని ఇన్‌చార్జి డీఎఫ్‌వో ఎస్.భరణి తెలిపారు. ప్రస్తుతం చిరుతపులి దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోనే ఉందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హౌసింగ్‌బోర్డుకాలనీ,ఆటోనగర్, దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ఏరియాల్లో పిల్లలను తల్లిదండ్రులు సాయంత్రం 6 గంటల తర్వాత బయటకు తిరగకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.

రైతుల కంట్లో.. పొగాకు!



నాడు గ్రేడ్ వన్ అధరహో.. నేడు లో గ్రేడ్ బెధరహో

- కొనుగోళ్లకు కంపెనీల నిరాసక్తత
- నాడు గ్రేడ్ వన్ కిలో రూ.400
- నేడు లో గ్రేడ్ రూ.130-రూ.120
- కొనేవారు లేక రైతుల ఆందోళన
- కేంద్రాల దళారుల రాజకీయం
- లబోదిబోమంటున్న రైతాంగం

గోపాలపురం/దేవరపల్లి, సెప్టెంబరు 15 : పొగాకు బంగారం.. ఎందుకంటే ఆరంభంలో ధర అదిరిపోయింది.ఎన్నడూ లేనిది రికార్డు స్థాయిలో విక్రయించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది నెంబర్ వన్ పొగాకుకు ధరలు ఆకాశాన్నంటాయి.అయితే చివరికి లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేసే వారులేక రైతుల ముఖం పొగచూరిపోతుంది. రైతుల పొగాకు బేళ్ళు యార్డుకు తీసుకురావడం..వెనక్కి తీసుకెళ్లడంతో తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. ఈ ఏడాది అమాంతం పొగాకు కిలో ధర రికార్డు స్థాయిలో రూ.400లకు అమ్ము డుపోయింది.అదే సమయంలో లోగ్రేడ్ పొగాకు మొదటి దశలో రూ.250 నుంచి క్రమంగా రూ.170ల దగ్గర ధర నిలకడగా నిలి చింది.దీంతో ఈ ఏడాది పెట్టుబడిపోనూ నాలుగురాళ్ళు వెనకేసుకుందామని అనుకున్న పొగాకు రైతాం గానికి కొత్త కష్టం వచ్చిపడింది. గ్రేడ్ వన్ పొగాకును కొనుగోలు చేసిన ఆయా కంపెనీల ప్రతినిధులు లోగ్రేడ్ (మాడు) పొగాకును కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపకపోవడంతో రైతుల గుండెల్లో ఇప్పుడే అసలైన గుబులు మొదలైంది.

దళారుల దందా..

ప్రతి రైతుకు ఎకరానికి క్వింటా నుంచి రెండు క్వింటా వరకు లోగ్రేడు(మాడు) తప్పకుండా ఉంటుంది. వాతావరణం అనుకూలించకపోయినా సాగులో తేడా వచ్చినా ఈ లో గ్రేడు పొగాకు మరింత అద నంగా పెరుగుతుంది.మేలురకం పొగాకు ధరలు అదనంగా ఉండడంతో కొందరు దళారులు లోగ్రేడ్ ధరలు బాగానే ఉంటాయని ఊహించి ఇప్పటికే పెద్దమొత్తంలో కొనుగోలు చేసి డబ్బు చేసినట్టు సమాచారం. వేలం కేంద్రంలో నిర్దేశించిన పొగాకు కన్నా అదనంగా పొగా కు ఉంటుందనే అంచనాలతో బయ్యర్లు, దళారులు కుమ్మక్కయి రైతు పొగాకును కొనుగోలు చేయడంలేదు. రెండు మూడు వారాలు రైతు వద్ద పొగాకు కొనుగోలు చేయకపోతే విసుగుచెందిన రైతులుపొగాకును బోర్డుకు తీసుకురావడం మానేస్తారని..ఆ సమయంలో దళా రుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేసి అధిక ధర ఇచ్చేందుకు దళారులు ఆయా కొనుగోలుదారులు కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇంత జరుగుతున్న బోర్డు అధికారులు మీనమేషాలు లెక్కవేస్తున్నారు.

ఇప్పుడేం చేయాలి..?

పొగాకు సాగు వచ్చే ఏడాదికి ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైనా గతేడాది పండించిన పొగాకు అమ్మకాలు పూర్తికాకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్జీనియా పొగాకు సాగులో పంట కాలం కంటే పండిన పంటను అమ్మడానికే ఎక్కువ సమయం పడుతుందని రైతులు భావిస్తున్నారు. ఆరు గాలం పండించిన పంట అమ్ముకో వడానికి ఆంక్షల మధ్య పొగాకు రైతాంగం కొట్టుమిట్టా డు తుంది.వచ్చే ఏడాది పొగాకు నాట్లుకు సంబంధించి నారు మ డులు పెంపకంలో రైతులు బిజీబిజీగా గడిపే సమయంలో సెప్టెంబరు మాసం వచ్చినా ఇప్పటికి పొగాకు కొనుగోళ్ల ప్ర క్రియ పూర్తి కాలేదు.దీంతో ఈ ఏడాది పంట కొనుగోలు పూర్తికాక వచ్చే ఏడాది పంటకు సన్నద్ధం కాలేక రైతులు ఇక్కట్లు పడుతున్నారు.తదుపరి పంట సాగుకు సన్నద్ధం కాక ముందే కొనుగోళ్లు పూర్తిచేయాలని రైతులు భావిస్తున్నారు.

పడిపోయిన పొగాకు ధర

నిన్న మొన్నటి వరకు గరిష్ఠ స్థాయిలో ధర పలికిన వర్జీనీయ పొగాకు చివరి దశలో ధర పతనమై కొనుగోలు చతికల బడ్డాయి. దీంతో లోగ్రేడ్ పొగాకు కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ఏడాది గ్రేడ్‌వన్ పొగాకు ధర రికార్డు స్థాయిలో రూ.400 ధర పలికింది. దీంతో రైతులు గ్రేడ్ వన్ పొగాకు విక్రయా లు మొదటి దశలో జరిపారు. పొగాకు కొనుగోళ్లు చివరి దశకు రావడంతో లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేయ డానికి ఆయా కంపెనీల ప్రతినిధులు వెనక డుగు వేస్తున్నారు. దీంతో వేలం కేంద్రం వద్ద లోగ్రేడ్ బేళ్ళు గుట్టలుగుట్టలుగా ఉన్నాయి.శనివారం గోపాలపురంలో లోగ్రేడ్ పొగాకును కనిష్టంగా రూ.130 రూపాయలకు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపకపోవడంతో రైతులు అమ్మకాలు నిలిపివేశారు.వేలం కేంద్రానికి శనివా రం 800 లోగ్రేడ్ పొగాకు బేళ్ళు అమ్మకానికి వచ్చి కొనుగోలు జరపకపోవడంతో ప్లాట్‌ఫామ్ పై గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలో లోగ్రేడ్ పొగాకు రూ.120లకు ధర పడిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొగాకు కంపెనీల మధ్య పోటీ లేక ఒకటి రెడు కంపెనీలే పాల్గొనడంతో ధర రూ.120కే పరిమితం చేశారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



నిన్నటి వరకూ సెపరేటు..

ఆదివారం పోడియం తొలగింపు

బ్రిటిష్‌కాలం నాటి సంప్రదాయానికి స్వస్తి

సబ్ రిజిస్ట్రారు పోడియం తొలగింపు

సీతానగరం,సెప్టెంబరు 15 : బ్రిటిష్ కాలంనాటి సంప్రదాయానికి స్వస్తి పలికారు.. ప్రజలకు స్నేహపూర్వక సేవలందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల కు ఆజ్యం పోశారు. రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా ఆదేశాల మేరకు సబ్ రిజిష్ట్రారు కార్యాలయాల్లో ఉన్న ప్రత్యేక పోడియంను ఆదివారం తొలగించారు.గతంలో సబ్ రిజిస్ట్రారు సీటు ప్రత్యేకతను సంతరించుకునే విధంగా ఎత్తుగా దిమ్మ కట్టి దిమ్మకు చుట్టూ ఎరుపు రంగు క్లాత్‌తో కప్పి ప్రత్యేకత చూపించేవారు. అయితే ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఫ్లోరింగ్‌కు సమాన ఎత్తులోనే టేబుల్ వేసుకుని ఎదురుగా కుర్చీలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మార్పులు చేస్తున్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం సీతానగరంలో పోడియం తొలగించారు.

చాగల్లులో ఏకాదశ సహస్ర గళార్చన

తెలగా సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న చిన్నారులు

చాగల్లు, సెప్టెంబరు 15: చాగల్లు తెలగా సంఘం ఆధ్వర్యంలో వినాయకుడి గుడి వద్ద 1008మంది చిన్నారులతో 11పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిడదవోలు, కొవ్వూరు, చాగల్లు, దేవరపల్లి, ఉండ్రాజవరం, పెరవలి మండలాల నుంచి చదువుకునే చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. సామూహిక గణపతి పూజ, సరస్వతి పూజ, ఆంజనేయస్వామికి అష్టోత్తర పూజ జరిగాయి. కార్యక్రమంలో హిందూ ధర్మపరిరక్షణ సమితి పెరవలి వారి మార్గదర్శకత్వంలో విశ్వహిందూ పరిషత్, భక్తులు దాతలు సహాయ సహకారాలు అందించారు. వేదపండితులు లింగాల శ్రీనివాసశర్మ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గంర్రోతు సురేంద్రకుమార్, శ్రీరాజరాజేశ్వరి విద్యాలయ డైరెక్టర్ వల్లిపల్లి వెంకటరామరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో పందుల బెడద



దేవరపల్లిలో సంచరిస్తున్న పందులు

దేవరపల్లి, సెప్టెంబరు 15: దేవరపల్లిలో పందుల బెడద ఎక్కువగా ఉండడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వెంకటేశ్వరనగర్, కెనరా బ్యాంకు వీధి, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీల్లో పందులు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ పెరట్లో పూలమొక్కలు, కూరగాయాల మొక్కలు, పాదులు ధ్వంసం చేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి పందులను నిర్మూలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

డ్రైన్ నిర్మాణానికి భూమి పూజ



మీనానగరంలో డ్రైన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

చాగల్లు, సెప్టెంబరు 15: చాగల్లు గ్రామ శివారు మీనానగరంలో డ్రైన్ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. మండల పరిషత్ నిధులు రూ.14.50 లక్షలతో గ్రామంలోని మెయిన్‌రోడ్డును చేర్చి నిర్మాణం చేసే ఈ డ్రైన్‌కు ఎంపీపీ మట్టా వీరాస్వామి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆళ్ల హరిబాబు, నాదెళ్ళ శ్రీరామ్, కరుటూరి సతీష్, కేతా సాహెబ్, ఉపసర్పంచ్ మేకా రాజు, బెజవాడ శుక్రాచార్యులు, బెజవాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీతారామ్ ఏచూరి మృతికి సంతాపం

చాగల్లు, సెప్టెంబరు 15: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మృతికి మండలంలోని ప్రజా సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. స్థానికంగా జరిగిన సంతాపం సభలో సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు ఎం.సుందరంబాబు మాట్లాడుతూ నిరంతం ప్రజల పక్షాన పోరాటే నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జీవీ సుబ్బారావు, కేకే దుర్గారావు, సుందరంబాబు, ఎస్‌కే ఆదాం, టి.కొండయ్య, కె.బుద్ధుడు, పల్లయ్య పాల్గొన్నారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, సెప్టెంబరు 15: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సుప్రభాత సేవ, ధూపహారతి, నిత్యార్చనా, లలితాపారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు, క్షీర, మహానివేదన నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాదం, పూజా టికెట్ల ద్వారా రూ.1,04,249 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.

వినాయకుడికి సరస్వతి పూజ




నిడదవోలులో సరస్వతి పూజలో పాల్గొన్న చిన్నారులు

నిడదవోలు, సెప్టెంబరు 15: నిడదవోలులోని యాదవుల వీధిలో వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సరస్వతి పూజ నిర్వహించారు. పూజలో చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, యాదవ సంఘం పెద్దలు పర్యవేక్షించారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

కొవ్వూరు, సెప్టెంబరు 15: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు వ్యక్తులకు గాయాలైనట్టు హెడ్‌కానిస్టేబుల్ ఎం.సునోద్‌కుమార్ తెలిపారు. రాజానగరం మండలం పుణ్యక్షేత్రం గ్రామానికి చెందిన వీరమళ్ల రాజా, అతడి స్నేహితుడు భూపాలపట్నం గ్రామానికి చెందిన విజయకుమార్‌తో కలిసి బుల్లెట్‌పై చాగల్లు మండలం మార్కొండపాడులో అత్తగారింటి వద్ద నున్న భార్యను చూసి తిరిగి ఇంటికి వెళ్తుండగా కొవ్వూరు రోడ్‌లో అండర్ పాస్ వద్ద కారు ఢీకొట్టింది. దీంతో ఇద్దరు కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. రాజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

బుచ్చయ్యపాలెంలో తాటాకిల్లు దగ్ధం



గోపాలపురం, సెప్టెంబరు 15: మండలంలోని కరగపాడు పరిధి బుచ్చయ్యపాలెంలో ప్రమాదవశాత్తూ తాటాకిల్లు దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు గ్రామానికి చెందిన వాసుబోయిన పకీరయ్య కుటుంబం తాటాకింటిలో నివాసం ఉంటోంది. ఆదివారం కుటుంబ సభ్యులు పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి ఇల్లు కాలి బూడిదైంది. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం దక్కలేదు.

నేడు యర్నగూడెంలో మెగా ఉచిత వైద్యశిబిరం

దేవరపల్లి, సెప్టెంబరు 15: మండలంలోని యర్నగూడెంలో ఆర్.కన్వెన్షన్ హాలులో ఈ నెల 16, 17తేదీల్లో టీడీపీ నాయకుడు పెనుమత్స సుబ్బరాజు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో అన్ని వ్యాధుల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. అలాగే క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని, రక్తదానం చేసే వారి కోసం శిబిరం వద్ద ప్రత్యేక ఏర్పాటు చేశామన్నారు. రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు పాల్గొంటారని చెప్పారు.

సినీ పరిశ్రమ ఏపీలో స్థిరపడేందుకు కృషి

- సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్
- గ్రామ ప్రజలకు విజ్ఞప్తి సినిమా టైటిల్ ఆవిష్కరణ



సినిమా టైటిల్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 15: సినీ పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌లో స్థిరపడేందుకు కృషి చేస్తామని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం షెల్టన్ హోటల్‌లో 4కె ఫిలిం ఫ్యాక్టరీ బ్యానర్‌పై నిర్మిస్తున్న గ్రామ ప్రజలకు విజ్ఞప్తి సినిమా టైటిల్‌ను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సినిమాల చిత్రీకరణకు కోనసీమ,తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు రంపచోడవరం తదితర అటవీ ప్రాంతాలు ఎంతో అనువైనవని అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ప్రేక్షకుల ఆదరణతోనే చాలా సినిమాలు విజయవంతమయ్యాయన్నారు. తెలంగాణా రాష్ట్రంతో పోల్చితే, మన రాష్ట్రం నైసర్గిక స్వరూపంలో పెద్దదైనప్పటికీ, సినిమా నిర్మాణానికి తగిన సౌకర్యాలు లేవని అన్నారు. సినిమా పరిశ్రమపై సీఎం చంద్రబాబు సదాభిప్రాయం ఉందని, సినీ పరిశ్రమ నుంచి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందాలనే స్థిర లక్ష్యంతో ఉన్నారని తెలిపారు. పలువురు ప్రముఖులు ఏపీలో సినిమా స్టూడియోలు ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని కోరారని చెప్పారు. ఇక్కడి నుంచి తెలంగాణాకు చిత్రపరిశ్రమ ద్వారా 63శాతం దాకా నిధులు వెళుతున్నాయన్నారు. ఏపీలో ఎందరో టెక్నీషియన్లు, కళాకారులు, ఆర్టిస్టులు ఉన్నారన్నారు. ఈ సినిమాకు ప్రముఖ హాస్యనటుడు గౌతమ్‌రాజు నేతృత్వం వహించడం అభినందనీయమని మంత్రి దుర్గేష్ అన్నారు. కార్యక్రమంలో సినిమా దర్శకుడు సాయి విజయ్ శ్రీరామ్, నిర్మాత ముంజులూరి పవన్‌కుమార్, హీరో సందీప్, హీరోయిన్ కావేరి, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



పాలంగిలో చండీయాగం ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చండీయాగం ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ఉండ్రాజవరం, సెప్టెంబరు 15: మండలంలోని పాలంగి గ్రామంలో నెలమూరుకు చెందిన ఉమా రామలింగేశ్వర స్వామి ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ చండీ మహారుద్ర పూర్వకోటి దీపోత్సవ యాగం ఆహ్వాన పత్రికలను పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కల్యాణార్థం ఇటువంటి చండీ యాగాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం స్థానిక కనకదుర్గమ్మ తల్లిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో యాగం నిర్వహకులతో పాటు తణుకు మునిసిపల్ మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి రేణుకా దంపతులు, నాయకులు సింహాద్రి రామకృష్ణ, నార్ని రామకృష్ణ, పాలంగి సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, కాకర్ల కరుణాకర్, కూటమి కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. తొలుత మంత్రి దుర్గేష్‌ను నిర్వాహకులు సత్కరించారు.

ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనం



కొవ్వూరులో విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న దృశ్యం

కొవ్వూరు, సెప్టెంబరు 15: గణపతి నవ రాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వినాయక విగ్రహాల నిమజ్జనాలు ఆదివారం నిర్వహించారు. స్థానిక పాతపేట రామాలయం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేశారు. అనంతరం 9 రోజులుగా పూజలందుకున్న గణపతి వెండి ప్రతిమకు, లడ్డూలకు వేలం నిర్వహించారు. ఆపై వినాయకుని పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లి గోదావరిలో నిమజ్జనం చేశారు. అలాగే మెరకవీధి వినాయకుని గుడి వద్ద డేగల రాము, నందమూరులో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానాలు చేశారు. గోష్పాదక్షేత్రంలో పోలీసు బందోబస్తు మధ్య విగ్రహాలను నదిలో క్రేన్, గజ ఈతగాళ్ల సహాయంతో నిమజ్జనాలు చేశారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నందున నది లోపలికి ఎవ్వరు వెళ్లకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యంలో సీఐ పి.విశ్వం పోలీసు బందోబస్తు నిర్వహించారు. నిమజ్జన ఏర్పాట్లను ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎల్.చెంచురెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో పట్టణ ఎస్ఐ పి.రవీంద్ర, ఫైర్ అధికారి ఏ.వి.ఎస్.ఎన్.ఎస్. వేణు, మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం, దేవరపల్లి గ్రామాల్లో వినాయక విగ్రహాలను వైభవంగా ఊరేగించారు. దేవరపల్లిలో బాలగణేష్ విగ్రహాన్ని ఎడ్లబండిపై పురవీధుల్లో బ్యాండు వాయిద్యాలతో, విచిత్రవేషధారణలతో, బాణ సంచా కాల్పులతో ఊరేగించి సాయంత్రం నిమజ్జనం చేశారు.

పెరవలి: మండలంలోని కానూరు, తీపర్రు, కాకరపర్రు, అజ్జరం, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు గ్రామాల్లో అందంగా అలంకరించిన వాహనాలపై వినాయక విగ్రహాలను ఉంచి వివిధ రకాల బ్యాండ్ మేళాలతో ఊరేగింపులు నిర్వహించారు. తీపర్రులో కాలువగట్టున ఏర్పాటు చేసిన వినాయకుని ఊరేగింపు వైభవంగా జరిగింది. బ్యాండ్, సన్నాయి మేళం, వివిధ రకాల వేషధారణలతో అట్టహాసంగా నిర్వహించారు. శివాలయ, వినాయక ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



దేవరపల్లిలో ఎడ్లబండిపై బాలగణేష్ ఊరేగింపు



పెరవలి: తీపర్రులో వినాయకుడిని ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా ఇంజనీర్స్ డే



కొవ్వూరులో ఎలక్ట్రికల్ ఏడీ అచ్యుతాచారిని సన్మానించిన లయన్స్‌క్లబ్ సభ్యులు

కొవ్వూరు, సెప్టెంబరు 15: మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నేటితరం ఇంజనీరు ఆదర్శంగా తీసుకోవాలని కొవ్వూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ దినోత్సవాన్ని ఆదివారం స్థానిక ట్రాన్స్‌కో ఏడీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ట్రాన్స్‌కో కొవ్వూరు ఏడీ పి.అచ్యుతాచారి, ఏఈలు డి.జగదీశ్వరరావు, సీహెచ్ శ్రీనివాసరావులను సత్కరించారు. సత్యనారాయణ, అచ్యుతాచారి మాట్లాడుతూ విశ్వేశరయ్య ఎన్నో బహుళార్థ సాధక ప్రాజెక్టులను, డ్రైనేజీలను రూపుదిద్దీ భావితరానికి ఇంజనీరింగ్ వ్యవస్థలో దిశా నిర్దే శం చేశారన్నారు. కార్యక్రమంలో యనమదల సుబ్రహ్మణ్యం, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, కలగర ఏడుకొండలు, ముళ్ళపూడి కాశీ విశ్వనాధరావు పాల్గొన్నారు.

పెరవలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ఇంజనీర్లను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రముఖులు మాదిరెడ్డి బాపూజీరావు, కోలా సీతయ్య నాయుడు, ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, బూరుగుపల్లి రాజు, ఏడిద సత్యనారాయణ, సలాది బాస్కరరావు, వంటెద్దు గోవిందరాజులు నాయుడు పాల్గొన్నారు.



పెరవలిలో ఇంజనీర్లను సన్మానిస్తున్న దృశ్యం

తాళ్లపూడి కూటమి శ్రేణుల దాతృత్వం



చెక్కు అందజేస్తున్న తాడిపూడి టీడీపీ నాయకులు

తాళ్లపూడి, సెప్టెంబరు 15: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం చంద్రబాబు పిలుపుతో తాళ్లపూడి మండలంలో పలు గ్రామాల నుంచి కూటమి నాయకులు విరాళాలు సేకరించారు. వాటిని సీఎం సహాయనిధికి అందజేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు అందజేశారు. గజ్జరం రూ.లక్ష, బల్లిపాడు రూ.లక్ష, పోచవరం రూ.90 వేలు, అన్నదేవరపేట రూ.90 వేలు, తాడిపూడి రూ.50,116(మొత్తం రూ.4,30,116) అందజేశారు. చెక్కు అందించిన వారిలో అల్లూరి విక్రమాదిత్య, కాకర్ల సత్యేంద్ర పాల్గొన్నారు. అలాగే తాడిపూడికి చెందిన నామా కొండబాబు ఆధ్వర్యంలో రూ.లక్ష సీఎం సహాయ నిధికి ఎమ్మెల్యే ముప్పిడి ద్వారా అందజేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటి సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణ, అర్బన్‌బ్యాంకు ఛైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ పాల్గొన్నారు.

బ్రాహ్మణగూడెం టీడీపీ శ్రేణులు రూ.1,01,116 సాయం

చాగల్లు, సెప్టెంబరు 15: విజయవాడ వరద బాధితులకు సహాయం కోసం మండలంలోని బ్రాహ్మణగూడెం టీడీపీ నాయకులు, కార్యకర్తలు రూ.1,01,116 సమకూర్చారు. సీఎం సహాయ నిధికి పంపే నిమిత్తం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు ఈ సొమ్మును ఆదివారం అందజేసారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకొనేందుకు ముందుకొచ్చిన పార్టీ శ్రేణులను, కూటమి నాయకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఆళ్ల హరిబాబు, గారపాటి బాబురావు, దొమ్మేటి వేణు, పత్తిపాటి సుబ్బారావు, శీని చంటి పాల్గొన్నారు.

'ఆన్‌లైన్ ఆటో డ్రైవర్ల సర్వీసు ఛార్జీలు పెంచాలి'

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 15: ఆన్‌లైన్‌లో బుక్ చేస్తున్న రాపిడ్, ఊబర్, ఓలా ఆటో డ్రైవర్లకు యాజమాన్యాలు వసూలు చేస్తున్న సర్వీస్ ఛార్జీలు పెంచాలని, కనీసం రూ.60 ఉండాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ది రాజమండ్రి ఆన్‌లైన్ రాపిడ్, ఊబర్, ఓలా ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మధు పాల్గొని మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

20 నుంచి విశిష్ట వ్యక్తులకు సత్కారాలు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 15: స్థానిక జిత్ మోహన్ మిత్ర కళావేదికలో ఈ నెల 20 నుంచి 28వరకు విశిష్ట వ్యక్తులకు సత్కారం, బిరుదు ప్రదానం జరుగుతుందని కళావేదిక అధ్యక్షుడు జిత్‌మోహన్‌మిత్ర తెలిపారు. కార్యక్రమాలకు సాహిత్యప్రియులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

కొవ్వూరు సబ్ కలెక్టర్‌కు ఘన వీడ్కోలు



సబ్‌కలెక్టర్ శ్రీవాస్తవతోపాటు ఆయన మాతృమూర్తిని సత్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

కొవ్వూరు, సెప్టెంబర్ 15: కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవకు రెవెన్యూ ఉద్యోగులు ఆదివారం ఘన వీడ్కోలు పలికారు. కొవ్వూరు సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆశుతోష్ శ్రీవాస్తవ బదిలీపై అదే హోదాలో పార్వతీపురం బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనకు కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించి ఘనంగా సత్కరించారు. సాధారణ ఎన్నికల్లో శ్రీవాస్తవ సేవలను ఉద్యోగులు కొనియాడారు. కాగా ఇన్‌చార్జి ఆర్డీవోగా కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణనాయక్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో జీఎస్ఎస్ జవహర్ బాజి, కె.రవివిక్రమ్, వీవీఎస్ ప్రశాంతి, ఇన్‌చార్జి తహశీల్దార్ కె.అజయ్ బాబుతోపాటు డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.67.52 లక్షలు వసూలు

- జి.ఎర్రంపాలెం బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచిలో దుర్వినియోగమైన సొమ్ము రికవరీ
- అధికారుల సమక్షంలో రేపటి నుంచి చెల్లింపులు
- జిల్లా కలెక్టర్ ప్రశాంతి



దివాన్‌చెరువు, సెప్టెంబరు 15: రాజానగరం మండలంలోని జి.ఎర్రంపాలెం బ్యాంకు ఆఫ్ బరోడా బ్రాంచి (బీవోబీ)లో దుర్వినియోగమైన సొమ్ము రూ.67.52 లక్షలను ఈనెల 17 నుంచి బ్రాంచిలో చెల్లింపులు జరుపుతున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జి.ఎర్రంపాలెం బీవోబీ బ్రాంచ్‌కు చెందిన వ్యాపార కరస్పాండెంట్ ముత్తాబత్తుల నానిబాబు కస్టమర్లకు చెందిన డిపాజిట్‌లను దుర్వినియోగం చేసినట్టు గుర్తించామన్నారు. సంబంధిత ఖాతాదారులకు ఆ మొత్తాన్ని చెల్లించాలని బ్యాంకు అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ఆ మేరకు ఆ మొత్తాన్ని ఖాతాదారులకు తిరిగి చెల్లింపులు జరపాలని బ్యాంకు నిర్ణయించి ఈ నెల 17 నుంచి జి.ఎర్రంపాలెం బ్రాంచ్‌లో డీఆర్‌డీఏ అధికారులు పర్యవేక్షణలో జమ చేయనున్నట్టు పేర్కొన్నారు. దుర్వినియోగమైనట్టు గుర్తించిన రూ.67.52 లక్షలను ఎం/ఎస్ విజన్ ఇండియా టెక్ సర్వీసెస్ లిమిటెడ్ నుంచి వసూలు చేసి బాధిత ఖాతాదారులకు ఆయా మొత్తాలను రీయింబర్స్ చేయనున్నట్టు బ్యాంకు అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారని కలెక్టర్ తెలిపారు. ఇందులో పుణ్యక్షేత్రం గ్రామానికి చెందిన 15 ఖాతాలకు సంబంధించి రూ.26,69,000, కొండగుంటూరు పాకలు గ్రామానికి చెందిన రెండు ఖాతాలకు రూ.81 వేలు, సంపత్‌నగరం గ్రామానికి చెందిన 6 గ్రూపుల ఖాతాలకు రూ.5,45,000, జి.ఎర్రంపాలెంకు చెందిన 41 ఖాతాలకు రూ34,11,757 దుర్వినియోగమైనట్టు గుర్తించామని డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి తెలిపారు. ఇప్పటికే సంబంధిత ఖాతాదారులకు సమాచారం తెలియజేశామన్నారు. డీఆర్‌డీఏ సమక్షంలో ఈ చెల్లింపుల ప్రక్రియ సజావుగా బ్యాంకు బ్రాంచ్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆయన చెప్పారు.

అనంత పద్మనాభ స్వామి వ్రత పుస్తకావిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 15: కోరుకొండ మండలం గాడాల శ్రీమహాలక్ష్మి పీఠంలో ఈనెల 17న 108 జంటలతో నిర్వహిస్తున్న అనంత పద్మనాభ స్వామి వ్రతానికి సంబంధించిన వ్రత పుస్తకాన్ని పీఠం స్వామిజీ చిన్నవెంకన్నబాబు స్వామి ఆవిష్కరించారు. ఆదివారం రాజమహేంద్రవరం జయశ్రీ గార్డెన్స్‌లో పీఠం ఉభయ తెలుగు రాష్ట్రాల ఛైర్మన్ మతల రమేష్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో స్వామిజీ పీఠం జాతీయ ఛైర్మన్ దుర్గా వెంకట హేమావతి మాతతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. వ్రతంలో పాల్గొనాలనుకునే భక్తులు 86888 88999 నెంబరును సంప్రదించాలని స్వామిజీ కోరారు. కార్యక్రమంలో సింగంశెట్టి మహితోష్, పూర్ణిమ రాజ్, బిందు, అంబటి శ్రీనివాసరావు, మత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



రాజమహేంద్రవరం బాయ్స్ హైస్కూల్ 1975-80 బ్యాచ్ విద్యార్థులు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 15: రాజమహేంద్రవరం ట్రైనింగ్ కాలేజీ ఆవరణలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పాఠశాలలో 1975-80 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని సందడి చేశారు. ఆనాటి మధురానుభూతులను, అల్లరి చేష్టలను గుర్తుచేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులకు రూ.50 వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో ఇమ్మిడి ప్రసాద్, సీహెచ్ రామకృష్ణ, బోడ కిషోర్, గండేపూడి శ్రీనివాస్, ముత్తంగి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో రచయితల సమావేశం



రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 15: కందుకూరి వీరేశలింగం కళాశాలలోని నాటక సమాజం హాలులో కళాగౌతమి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రచయితల సమావేశం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్రాంత ఆచార్యులు చిలుకూటి కూర్మయ్య మాట్లాడుతూ నది అంటేనే ఒక గతి,కమనీయ శ్రుతి,రమణీయ జతి అని అన్నారు. ప్రముఖ సినీ గేయ రచయిత సినారే రాసిన కృష్ణవేణీ తరంగిణి జాలిగుండెయే, సాగరమ్మయి, రూపు సవరించుకొను నీట.. అడవే జల కమ్ము లాడవే, పాటను గుర్తుచేశారు. ఈ సభను ప్రారంభించిన వీపీబీ సంజీవరావు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రంలోని చలన చిత్ర పరిశ్రమకు నదులు ఆయువు పట్టు వంటివని అన్నారు. ఒక దశలో చిత్ర గీతాలలో కృష్ణాగోదావరీ నదుల మీద చరణాలు,పల్లవులు, లేకుండా సినిమాలు ఉండేవి కావంటే అతిశయోక్తి లేదన్నారు. బేతా శారదాదేవి ప్రార్థనతో ప్రారంభమైన కవితా గోష్టి కార్యక్రమంలో బీహెచ్ రామాదేవి, చీరల సీతా రామనాయుడు, జి.వినయ్, టి.శంకర్, నాగసాయి పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి

ధవళేశ్వరం, సెప్టెంబరు 15: గోదావరి వరద మూడు రోజులుగా తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం 9.50అడుగులకు చేరుకోగా 6,90,849క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ఎగువన భద్రాచలం వద్ద నీటి మట్టం 35.30అడుగులకు చేరుకుంది.

దుకాణంలోకి దూసుకెళ్లిన గ్యాస్ సిలెండర్ల లారీ

రాజానగరం, సెప్టెంబరు 15: అనపర్తి నుంచి గుమ్మళ్లదొడ్డి గ్రామానికి గ్యాస్ సిలెండర్లతో వస్తున్న లారీ మార్గమధ్యంలో రాజానగరం మండలం తోకాడ గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తూ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని, కిళ్లీ దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్థులు చెబుతున్నారు. తనకు నీరసంతో కళ్లు తిరిగినట్టు అయ్యిందని, అందువల్లే లారీ అదుపు తప్పినట్లు డ్రైవర్ చెబుతున్నాడు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ స్క్రీన్1	: సరిపోదా శనివారం
వై.స్క్రీన్2	: డిమోంటి
దేవిశ్రీ(గాయత్రి	: డబుల్ ఇస్మార్ట్
అనన్య	: ఆయ్
నిడదవోలు	
వీ మ్యాక్స్	: సరిపోదా శనివారం
రాధాకృష్ణ	: ది గోట్
శ్రీగణపతి	: ఆయ్, కమిటీ కుర్రోళ్లు
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	: డబుల్ ఇస్మార్ట్